# మిసిమి

మాస పత్రిక

ఏప్రిల్ 2009



सरस्वती नः सुभगामयस्करत्

రూ.8/-



కృష్ణకుమార్ బిర్లా

# మిసిమి

"All that we are is the product of what we have thought"
- *Dammapada.*


సంపుటి 20 | ఏప్రిల్ 2009 | సంచిక 4

వ్యవస్థాపక సంపాదకుడు : **డాక్టర్ రవీంద్రనాథ్ ఆలపాటి**


## విషయ సూచిక


సరస్వతీ సమ్మాన్ - పరిచయం — డా॥ జె. లక్ష్మిరెడ్డి

లోహియా సోషలిజమ్ — అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి

లోక హితవాది లోహియా
(డా॥ లోహియా శతజయంతి ఉత్సవాల సందర్భంగా) — డా॥ శివలింగం

భిక్షువులు — హిందీమూలం : వాసుదేవశరణ్ అగ్రవాల్
తెలుగు - ఘట్టమరాజు

వికిరణాలతో ఎదురయ్యే సమస్యలు — సి.వి. సర్వేశ్వర శర్మ

కోటి లింగాల వివరాలు - పరిరక్షణ — డా॥ మలయశ్రీ



విడిప్రతి రూ. **8/-** వార్షిక చందా రూ. **100/-** విదేశీయులకు **$ 20**

ముఖచిత్రం : "సరస్వతీ సమ్మాన్" ప్రతీక చిహ్నం

Printed & Published by **Bapanna Alapati,** at Kala Jyothi Process Pvt. Ltd.,
1-1-60/5, R.T.C. 'X' Roads, Musheerabad, Hyderabad - 20. Ph. 27645536
E-mail : misimi@kalajyothi.com

సంపాదకుడు : **అన్నపరెడ్డి వెంకటేశ్వర రెడ్డి**
సెల్: *94412 74960*

# బౌద్ధం - స్వేచ్ఛ

ప్రపంచ మతాలలో కెల్ల ఆలోచనా స్వేచ్ఛను ఇచ్చిన మతం ఒక్క బౌద్ధమతమే. ప్రతి ఇతర మతం తన ప్రాథమిక అంశాలను ప్రశ్నించే వీలు లేదంది. అలా ప్రశ్నించే వీలు లేదనడమే దాని బలమూ, దాని బలహీనత - రెండూ. ఎలాగంటే దాని ప్రాథమికాంశాలను (ఉదాహరణకు దేవుడున్నాడనే ప్రాథమికాంశాన్ని) ప్రశ్నిస్తే దాని దగ్గర సమాధానం లేదు. అది దాని బలహీనత. మరి అదే దాని బలం ఎలా అవుతుందంటే, ప్రశ్నించే హక్కు లేదంటుంది గనుక, ఆ విధంగా ప్రశ్నించే వాడు నోరు మూసుకోవాలి గనుక.

బౌద్ధం పద్ధతి ఇది కాదు, ప్రశ్నించమంటుంది. ప్రశ్నించి సమాధానం రాబట్టుకో మంటుంది. అలా వచ్చిన సమాధానాన్ని తప్పక అంగీకరించి తీరవలసిన ఆవశ్యకత లేదు. ఆ వచ్చిన సమాధానాన్ని, కంసాలి గీటురాయి మీద గీసి బంగారం వన్నెను ఎలా లెక్కగడతాడో - అలాగే తన అనుభవ రాసితో బేరీజు వేసుకొని దాని విలువ కట్టాలి. ఈ విధంగా బౌద్ధం స్వేచ్ఛా చింతనాన్ని పరిమితిస్తుంది. స్వేచ్ఛాచింతనం అంటే హద్దులు లేని స్వైర కల్పన కాదు. పిచ్చి పిచ్చి ఆలోచన కాకుండా, అది హేతుబద్ధంగా ఉండాలి. శాస్త్రీయంగా ఉండాలి. వివేచనకు నిలవాలి. అందుకే బుద్ధిహీనులకు బౌద్ధంలో చోటు లేదన్నాడు ఒక పెద్ద మనిషి.

ఇతర మతాలు దేవుడు చెప్పాడని, దేవుని కుమారుడు చెప్పాడని, దేవదూత చెప్పాడని, అందుకని వారు చెప్పిన వాటి వ్యతిక్రమించే వీలు లేదని, వాటికి బద్ధులమై ఉండాలని చెప్పాయి. బుద్ధుడు అలా మన బుర్రలను దేవునికి తాకట్టు పెట్టమన లేదు. జ్ఞానోదయం అయిన అనంతరం బుద్ధుడు ఇలా అన్నాడు: "భిక్షులారా ఇప్పుడు మీరు, నేనూ అందరం ఇక ఏ మాత్రం మానవ, దివ్య బంధనాలలో చిక్కుకొని పోలేదు. మనకు పూర్తి స్వేచ్ఛ ఉంది."

## వినతి

**2009, మే నెల 9వ తేదీన బౌద్ధ ప్రపంచమంతా బుద్ధపూర్ణిమ పండుగను జరుపుకొంటుంది. ఆ పండుగను పురస్కరించుకొని 'మిసిమి'ని బుద్ధ జయంతి విశేష సంచికగా వెలువరించదలిచాము. ఆ సంచికకు బౌద్ధం మీద మీ అమూల్య రచనలను, అచ్చులో 5, 6 పుటలకు మించకుండా రాసి, ఈ నెల 15వ తేదీలోగా పంపవలసిందిగా మా పాఠక రచయితలను, ఇతర రచయితలను కోరుతున్నాము. సహకరించండి.**

**లోహియా శత జయంతిని పురస్కరించుకొని ఈ సంచికలో లోహియా మీద రెండు వ్యాసాలను ప్రచురిస్తున్నందుకు సంతోషిస్తున్నాము.**

**- సంపాదకుడు**

सरस्वती नः सुभगामयस्करत्

# సరస్వతీ సమ్మాన్ - పరిచయం

- డా॥ జె. లక్ష్మిరెడ్డి

ప్రసిద్ధ పారిశ్రామికవేత్త, పార్లమెంటు సభ్యుడు కృష్ణకుమార్ బిర్లా 1990లో 'కె.కె. బిర్లా ఫౌండేషన్'ను స్థాపించారు. ఈ ఫౌండేషన్ ఉద్దేశ్యం సాహిత్యం, విద్య, కళ, సంస్కృతి, తత్వశాస్త్రం, విజ్ఞాన శాస్త్రం, మొదలైన రంగాల్లో శుభకరమైన, చైతన్య దాయకమైన కార్యకలాపాలను ప్రోత్సహించడం.

1992 మార్చి 9న ఏర్పాటయిన మొదటి సరస్వతీ సమ్మాన్ ప్రదానోత్సవంలో ఫౌండేషన్ అధ్యక్షులు కృష్ణకుమార్ బిర్లా ఫౌండేషన్ ఆశయాలను, కల్పనలను గురించి చెప్తూ ఇలా అన్నారు–

"నేటి క్లిష్ట పరిస్థితుల్లో సాహిత్యం పాత్ర మరింత విస్తృతం కావడం అవసరం. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత ఒక ఉన్నత అమెరికా సైన్యాధికారి ఇలా అన్నాడు— "మనం న్యూక్లియర్ దైత్యుల మేమో అయిపోయాం. కానీ నైతికతా దృష్టితో ఇంకా శిశువులు గానే ఉండిపోయాం." (We are Nuclear giants but moral infants) గత 47 ఏండ్లలో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారింది. అమెరికా సైన్యాధికారి చెప్పిన సత్యంలోని భీకరమైన దానవుడు ఇప్పుడు నోరు తెరుచుకొని మన ముందు నిలిచి ఉన్నాడు. వైజ్ఞానిక, సాంకేతిక ప్రగతివల్ల మనకెన్ని భౌతిక సుఖాలు, సౌకర్యాలు లభించినా, అవి మానవున్ని తన అస్తిత్వం కొనసాగింపు గురించి పూర్తిగా భయపడేట్లు కూడా చేశాయనేది మాత్రం కఠోరమైన సత్యం. మానవునిలోని అదమ్య సాహసం వల్లనే అతని ఆత్మశక్తి ఎప్పుడూ ఓటమిని అంగీకరించదు, మానవత మంచి భవిష్యత్తుకు సంబంధించిన ఆశలను వదలుకోదు. నిరంతరం సాగే ఈ పోరాటంలో మానవతకున్న అతిపెద్ద ప్రేరణా స్రోతస్సు, తోడు సాహిత్యం. సాహిత్యం పశు ప్రవృత్తులను నశింపచేసి శాశ్వత విలువలను బలపరుస్తుంది, మానవుని చైతన్యాన్ని మేల్కొలిపి అతడు తనలోని దైవీయ ప్రకాశాన్ని తెలుసుకునేట్లు చేస్తుంది. ఈ విధంగా సాహిత్యం మానవున్ని ఆత్మవినాశనం నుంచి రక్షిస్తుంది. అందువల్ల ఉత్కృష్ట సాహిత్యాన్ని గౌరవించడానికి సామాజిక నిబద్ధతతో దగ్గరి సంబంధం ఉంది. మా కార్యక్రమంలో సాహిత్యానికి ఇవ్వబడుతున్న ప్రత్యేక ప్రాధాన్యతకు కారణం ఇదే.

"భారతీయ సాహిత్యం ఆదికాలం నుంచి శాశ్వత జీవన విలువల సందేశం ఇస్తూ వస్తూంది. అనేక భాషలున్న ఈ దేశంలో వేర్వేరు భాషల్లో అది అభివ్యక్తి పొందుతున్న ఈ రోజుల్లో కూడా అందులో మునుపటి లాగానే ప్రాణదాయక శక్తి ఉంది. వేర్వేరు భాషల సంప్రదాయాలు వేరు-వేరుగా ఉన్నా భారతీయ సాహిత్యం యొక్క మూలాధారమైన సంవేదన ఒకటే. దాన్ని అవగాహన చేసుకోవడంలో ఒక వ్యావహారికమైన ఇబ్బంది ఉంది. రాజకీయ-సామాజిక పరిస్థితులు అప్పుడప్పుడు దీన్ని మరింత పెంచుతూ ఉంటాయి. సాధారణంగా ఇంగ్లీషు ద్వారా మనం విదేశ సాహిత్యాన్ని గురించి తెలుసుకుంటాం. అయితే మనదేశంలోని ఒక ప్రాంతంలోని సాహిత్యాభివ్యక్తి గురించి ఇతర ప్రాంతాల వారికి ఎంత తక్కువగా తెలుస్తూ ఉందో, దాన్ని గురించి పట్టించుకోము...

డాక్టర్ జె. లక్ష్మిరెడ్డి, బి-1/93, జనక్‌పురి, న్యూఢిల్లీ-110 058

తన భాష హద్దులను దాటి మొత్తం దేశాన్ని ప్రభావితం చేసిన రచనలందించిన రవీంద్రనాథ్ ఠాకుర్, శరత్‌చంద్ర చటర్జీ, ప్రేమచంద్ లాంటి విలక్షణ ప్రతిభా సంపన్నులైన సాహిత్యకారులు అరుదుగానే ఉంటారు. భారతీయ జ్ఞానపీఠ్ ఈ పరిస్థితిని మెరుగు పరచేందుకు ప్రశంసనీయమైన కృషి చేసింది. అయినా ఇంకా చేయవలసింది చాలా ఉంది. ఈ మధ్య సరస్వతీ సమ్మాన్ ప్రకటించినప్పుడు వేరే భాషకు చెందిన ఒక ఆచార్యుడు ఆశ్చర్యంతో అడిగాడు, "బచ్చన్ 1940-42 తర్వాత కూడా ఏదైనా గొప్ప రచనలు చేశారా?" ఈ ప్రశ్న కేవలం మన పరిస్థితుల నుంచే పుట్టింది. భారతీయ సాహిత్యం యొక్క సమగ్రతను దృష్టిలో ఉంచుకొని దేశ సమైక్యత కోసం మన గొప్ప సృజనాత్మక రచనలను భాషకు సంబంధించిన సంకుచిత హద్దుల్లోంచి వెలుపలికి తెచ్చి దేశం మొత్తంలో ప్రతిష్ఠించడం అవసరమైంది. ఈ ఉద్దేశ్యంతో జరుగుతున్న ప్రయత్నాల్లో 'సరస్వతీ సమ్మాన్' మా ఒక చిన్న ప్రయత్నం.

ఇలాంటి ప్రణాళికలకు కొన్ని హద్దులుంటాయనే విషయం మాకు తెలుసు. అందువల్ల కేవలం ఈ సమ్మాన్‌ను ఆరంభించి మేము తృప్తి పడడంలేదు. వేరు-వేరు భాషల పరస్పర సంబంధాన్ని దృఢ పరచవలసిన అవసరం నిరంతరంగా పెరిగి పోతూంది. అందువల్ల సరస్వతీ సమ్మాన్ నేపథ్యంలో మేము వేర్వేరు భాషల తులనాత్మక అధ్యయనాన్ని ప్రోత్సహించే ప్రణాళికను రూపొందించాం. లోతుగా అలాంటి అధ్యయనం చేయదలచుకున్న వారికి మౌలికమైన పరిశోధన సామాగ్రి, అవసరమైన పుస్తకాలు కొనడానికి గ్రాంటు, ఉపకారవేతనం, ఇతర సహాయ-సహకారాలు అందించాలనుకున్నాం".

ఈ ఫౌండేషన్ తన ఇతర ప్రణాళికలతో పాటు సాహిత్యంలో నాలుగు పెద్ద సమ్మానాలు/ పురస్కారాలు స్థాపించింది— సరస్వతీ సమ్మాన్ (హిందీ, సంస్కృతంతో సహా అన్ని భారతీయ భాషలకోసం), వ్యాస సమ్మాన్ (హిందీ కోసం), బిహారీ పురస్కారం (రాజస్థానీల హిందీ/రాజస్థానీ రచనల కోసం), వాచస్పతి పురస్కారం (సంస్కృతం కోసం). ఈ పురస్కారాలు నిస్సందేహంగా ఒక సాంఘిక ప్రయోజనాన్ని నెరవేరుస్తున్నాయి.

కె.కె. బిర్లా ఫౌండేషన్ ప్రదానం చేసే పురస్కారాలన్నింటిలో ప్రధానమైన 'సరస్వతీ సమ్మాన్' భారత రాజ్యాంగంలోని 8వ షెడ్యూలులో చేర్చబడిన ఏ భాషలోనైనా సమ్మాన్ ప్రదానం చేసే సంవత్సరానికి ముందటి పదేండ్ల కాలావధిలో వెలువడిన భారతీయ నాగరికుని ఒక ఉత్కృష్ట సాహిత్య రచనకు ప్రతి సంవత్సరం ఇవ్వడం జరుగుతుంది. మొదట్లో ఈ సమ్మాన్ కోసం 15 భాషల రచనలను పరిశీలనలోకి తీసుకునేవారు. అయితే 1992లో కొంకణి, మణిపురి, నేపాలీ భాషలను, 2004లో బోడో, డోగ్రీ, మైథిలీ, సంథాలీ భాషలను, 8వ షెడ్యూలులో చేర్చిన తర్వాత ఈ భాషలను కూడా పరిశీలనలోకి తీసుకోవడం జరుగుతూంది. సృజనాత్మక రచనలేకాక ఏ ఇతర సాహిత్య ప్రక్రియకు కూడా, ఉదాహరణకు— సాహిత్య చరిత్ర, భాషా చరిత్ర, సమాలోచన, వ్యాసం, ఆత్మకథ, జీవిత చరిత్ర మొదలైన వాటికి కూడా— ఈ సమ్మాన్ ఇవ్వడానికి వీలుంది. సమ్మాన్‌తో పాటు ఇచ్చే పురస్కార ధనరాశి మూడు లక్షలతో మొదలై ఇప్పుడు 5 లక్షలకు చేరుకుంది. ఇప్పటివరకు 17గురు రచయితలు ఈ సమ్మాన్ పొందారు. డా॥ హరివంశరాయ్ బచ్చన్ (1991, హిందీ: నాలుగు భాగాలుగా వెలువడిన ఆత్మకథ), రమాకాంత రథ్ (1992, ఒరియా కవిత్వం : రాధ), విజయ్ తెందుల్కర్ (1993, మరాఠీ నాటకం : కన్యాదాన్), డా॥ హరిభజన్ సింహ్ (1994,

పంజాబీ కవిత్వం : రూఖ్ తే ఋషి), బాలామణి అమ్మ (1995, మళయాళీ కవిత్వం: నైవేద్యమ్), శమ్సు ర్రహమాన్ ఫారూకీ (1996, ఉర్దూ సాహిత్య సమాలోచన: శేర్ - ఏ - శోర్ అంగేజ్), మనుభాఈ పాంచోలీ 'దర్శక్' (1997, గుజరాతీ నవల : కురుక్షేత్ర), ప్రొ. శంఖ్ ఘోష్ (1998, బెంగాలీ కవిత్వం : గంధర్బ్ కబితా గుచ్ఛ), డా॥ ఇందిరా పార్థసారధి (1999, తమిళ నాటకం: రామానుజర్), మనోజ్‌దాస్ (2000, ఒరియా నవల: అమృత ఫల్), డా॥ దిలీప్ కౌర్ తివానా (2001, పంజాబీ నవల: కథా కహో ఊర్వశీ), మహేశ్ ఎల్‌కుంచ్వర్ (2002, మరాఠీ నాటకం: యుగాంత్), ప్రొ. గోవిందచంద్ర పాండే (2003, సంస్కృత కావ్యం: భాగీరథీ), సునీల్ కుమార్ గంగోపాధ్యాయ (2004, బెంగాలీ నవల: ప్రథమ్ ఆలో) ప్రొ. అయ్యప్ప పణిక్కర్ (2005, మళయాళీ కవితా సంపుటి : అయ్యప్ప పణిక్కరుడే కృతికల), జగన్నాథ ప్రసాద్ దాస్ (2006, ఒరియా కవిత్వం : పరిక్రమ), సయ్యార్ మసూద్ (2007, ఉర్దూకవిత్వం : తాఊస్ చమన్ కీ మైనా).

ఇన్ని భాషల్లోంచి ఒక ఉత్కృష్ట రచనను ఎంపిక చేయడం సులభం కాదు. 1965లో భారతీయ జ్ఞానపీఠ్ ఏర్పాటు చేసిన 'జ్ఞానపీఠ్ పురస్కారం' ఈ దిశలో మార్గదర్శకమైన ఒక ప్రయత్నం. బిర్లా ఫౌండేషను, చయన పరిషత్తు దుష్కరమైన ఈ పనికిగాను అత్యంత స్పష్టమైన, పక్షపాత రహితమైన ఒక ప్రక్రియను రూపొందించాయి.

సమ్మాన్ కోసం రచనను ఎంపిక చేయడంలో ఫౌండేషన్ పాత్ర చాలా పరిమితమే. దాని ప్రధానమైన పని ఎంపిక ప్రక్రియకు సంబంధించిన వేర్వేరు సమితులకు రాతకోతల్లో సహాయం అందించడమే. ఎంపిక చేసే బాధ్యత దేశంలోని మూర్ధన్య పండితులతో విస్తారంగా చర్చలు జరిపిన తర్వాత తయారుచేయబడిన 'సరస్వతీ సమ్మాన్ నియమావళి' ఆధారంగా నిర్మించిన ఒక చయన పరిషత్తుకు అప్పగించడం జరిగింది. చయన పరిషత్తులో అధ్యక్షునితో సహా 12 మంది సభ్యులున్నారు. మొదట్లో భారతదేశ పూర్వ ప్రధాన న్యాయమూర్తి రంగనాథ్ మిశ్ర 4-4 సంవత్సరాల కోసం రెండు సార్లు చయన పరిషత్తు అధ్యక్షులుగా ఎంపిక అయ్యారు. నియమావళి ప్రకారం చయన పరిషత్తు అధ్యక్షుడు రెండు పర్యాయాలు మాత్రమే ఎంపిక కాగలుగుతాడు. శ్రీమిశ్ర తరువాత ఆయన స్థానంలో సుప్రీం కోర్టు పూర్వ న్యాయమూర్తి H.R. ఖన్నా అధ్యక్షులయ్యారు. ఇప్పుడు ఆయన స్థానంలో న్యాయమూర్తి గోపాల వల్లభ పట్టనాయక్ అధ్యక్షులుగా ఉన్నారు. నామినేషన్ చేసిన సభ్యుల పదవీ కాలం కూడా నాలుగు సంవత్సరాలే. వాళ్ళు కూడా వరుసగా రెండు సార్లకు మించి నామినేట్ కావడానికి వీలులేదు. చయన పరిషత్తులోని సాహిత్యకారులు దేశంలోని దాదాపు అన్ని ప్రాంతాల నుంచి ఎన్నుకోబడతారు. ఈ చయన పరిషత్తు సహాయం కోసం నాలుగు క్షేత్ర సమితులు, 22 భాషా సమితులు ఉన్నాయి.

చయన ప్రక్రియ ఆరంభించడానికి దేశంలోని అన్ని విశ్వవిద్యాలయాలకు, ప్రధానమైన సాహిత్య సంస్థలకు, పండితులకు, ఆచార్యులకు, రచయితలకు, ప్రబుద్ధ పాఠకులకు ప్రతిపాదన ఫారాలు పంపి వారి నుంచి ప్రతిపాదనలు ఆహ్వానించడం జరుగుతుంది. ఈ ఫారాలు దేశంలోని అన్ని భాషలకు సంబంధించిన వీలైనంత ఎక్కువమందికి పంపడం జరుగుతుంది. ఈ విధంగా వచ్చిన ప్రతిపాదనలను ఆయా భాషలకు సంబంధించిన భాషా సమితులకు అప్పగిస్తారు. ప్రతి భాషకు ఒక ప్రత్యేకమైన సమితి ఉంది. ప్రతి సమితిలో ముగ్గురు సభ్యులుంటారు. వీరిలో ఒకరు

సంయోజకుడుగా వ్యవహరిస్తారు. భాషా సమితులు తమ సౌకర్యాన్ననుసరించి ఏదో ఒకచోటు సమావేశమవుతాయి. అవిచ్ఛిన్నత, మార్పు రెండూ ఉండాలనే ఉద్దేశ్యంతో సాధారణంగా భాషాసమితిలోని ఒక సభ్యుణ్ణి ప్రతి సంవత్సరం మార్చడం జరుగుతుంది. ఈ సమితిలోని సభ్యులందరు పేరున్న పండితులు, రచయితలు, సమాలోచకులు అయి ఉంటారు. తన సిఫారసు చేయడానికి భాషాసమితి తన వద్దకు చేరిన ప్రతిపాదనలలోని రచనలనే కాక ఇతర రచనలను కూడా పరిశీలనలోకి తీసుకోవచ్చు. అవి నియమావళి ప్రకారం ప్రతిపాదించడానికి తగినవయి ఉంటే చాలు. ప్రతి భాషా సమితి సరస్వతీ సమ్మాన్ నియమావళిలోని నిబంధనలననుసరించి మూడు భాగాలుగా ఒక విస్తృతమైన రిపోర్టు దాఖలు చేస్తుంది. ఇది చయన ప్రక్రియలోని మొదటి దశ.

రిపోర్టులో సిఫారసు చేసిన రచన విశిష్టత, ప్రవృత్తి, రచయిత పరిచయం, అతని మొత్తం సాహిత్య కృషి గురించిన వివరాలు ఉంటాయి. సాధారణంగా రచన హిందీ లేక ఇంగ్లీషు అనువాదం, లేదా అందులోని కళాత్మక అంశాల అనువాదం కూడా రిపోర్టుతో పాటు జతచేయడం జరుగుతుంది.

చయన ప్రక్రియ రెండో దశలో వేర్వేరు భాషా సమితుల సిఫారసులను ఆ భాషలకు సంబంధించిన నాలుగు క్షేత్ర సమితులు లోతుగా పరీక్షిస్తాయి. క్షేత్ర సమితుల ఏర్పాటు ఈ విధంగా ఉంది—

1. తూర్పు సమితి : అసమియా, ఒరియా, బెంగాలీ, మణిపురి.
2. ఉత్తర సమితి : ఉర్దూ, కాశ్మీరీ, నేపాలీ, పంజాబీ, హిందీ.
3. పశ్చిమ సమితి : కొంకణి, గుజరాతీ, మరాఠీ, సింధీ.
4. దక్షిణ సమితి : కన్నడం, తమిళం, తెలుగు, మళయాళం.

(సంస్కృతం ఏ ఒక్క క్షేత్ర సమితిలో చేరి ఉండదు. ప్రతి సంవత్సరం వంతులవారీగా అది వేర్వేరు క్షేత్ర సమితుల్లో చేర్చబడుతుంది.)

క్షేత్ర సమితి సభ్యులు, ఆ క్షేత్రానికి సంబంధించిన భాషాసమితుల సంయోజకులే/ప్రతినిధులే. ఈ నాలుగు క్షేత్ర సమితుల సమావేశాలకు అధ్యక్షత వహించడానికి ప్రతిసంవత్సరం చయన పరిషత్తు అధ్యక్షుడు పరిషత్తులోని నలుగురు సభ్యులను నామినేట్ చేస్తాడు. (ఈ విధంగా ఈ పరిషత్తులోని నలుగురు సభ్యులు క్షేత్రసమితి స్థాయిలో కూడా తమ సహకారం అందిస్తారు). క్షేత్ర సమితి స్థాయి నుంచి ఈ విధంగా వేర్వేరు భాషలలోని సాహిత్య రచనలను పోల్చి వాటికి విలువకట్టే ప్రక్రియ మొదటి దశ ఆరంభమవుతుంది. ఎంపికలో క్షేత్రసమితి ప్రాధాన్యాన్ని దృష్టిలో ఉంచుకొని దాని కార్యకలాపాల పట్ల ప్రత్యేకమైన శ్రద్ధ చూపడం జరుగుతుంది. క్షేత్ర సమితి తన పరిధిలోని భాషా సమితుల సిఫారసులను పరిశీలించిన తర్వాత తన సిఫారసును తయారుచేస్తుంది. భాషా సమితికున్నట్లే క్షేత్ర సమితికి కూడా ఎవరిద్వారా కూడా ప్రతిపాదించబడని, ఏ భాషా సమితి ద్వారా కూడా సిఫారసు చేయబడని తగినవనిపించే రచనలను కూడా పరిశీలనలోకి తీసుకొనే అధికారం ఉంటుంది. దీని తర్వాత భాషా సమితుల సంయోజకులకు (వీళ్ళు తమకు సంబంధించిన క్షేత్ర సమితిలో సభ్యులుగా ఉంటారు) ఇతర క్షేత్ర సమితుల నిర్ణయం తెలియజేయడం

జరుగుతుంది. ఈ నిర్ణయాలకు సంబంధించిన సమాచారమంతా కూడా వారికి అర్పించి నాలుగు క్షేత్ర సమితులు ఏ రచనలను సిఫారసు చేశాయో, వాటిని గురించి తమ అభిప్రాయం తెలుపుతూ వాటిలో సర్వశ్రేష్ఠమైన రచనగా దేన్ని భావిస్తారో తెలియజేయమని కోరడం జరుగుతుంది. ఈ విధంగా క్షేత్ర సమితుల ద్వారా తీసుకున్న నిర్ణయాలు, ఆ తర్వాత ప్రతి సమితిలోని ప్రతి సభ్యుడు వేరువేరుగా వెలిబుచ్చిన అభిప్రాయం ఉపయోగకరంగా ఉంటాయి. ఇక్కడ ప్రధానమైన విషయమేమిటంటే ఈ స్థాయిలో భాషాసమితుల సంయోజకులు తమ భాషకు మాత్రమే ప్రతినిధులుగా ఉండకుండా భాషల పోటీకి అతీతంగా మొత్తం భారతీయ సాహిత్య అధ్యేతలుగా పాలు పంచుకుంటారు. ఇక్కడ గుర్తుంచుకోవలసిన మరో విషయం ఏమిటంటే చయన పరిషత్తు గానీ, క్షేత్ర సమితులు గానీ, భాషా సమితులు గానీ తమ వద్దకు పంపబడిన రచనల ప్రతిపాదనలను, సిఫారసులను మాత్రమే పరిశీలనలోకి తీసుకోవాలనే నిబంధన ఏమీలేదు. అవి తమ-తమ అధ్యయనాన్ని, అవగాహనను అనుసరించి ఏ రచనైనా పరిశీలనలోకి తీసుకోవచ్చు. ఫౌండేషన్ సంచాలకుడు కూడా అయిన చయన పరిషత్తు కార్యదర్శి సాధారణంగా అన్ని క్షేత్ర సమితుల సమావేశాలకు పర్యవేక్షకుడుగా హాజరవుతాడు.

చివరిదైన మూడవ దశ చయన పరిషత్తుకు సంబంధించింది. మునుపు చెప్పినట్లు దేశంలోని వేర్వేరు భాషల ప్రసిద్ధ పండితులు, సాహిత్యకారులు ఇందులో సభ్యులుగా ఉంటారు. ఇంతవరకు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు ఈ పరిషత్తుకు అధ్యక్షత వహిస్తూ వచ్చారు. మునుపు చెప్పినట్లు మొదటి 8 సంవత్సరాలు భారత దేశ పూర్వ ప్రధాన న్యాయమూర్తి రంగనాథ్ మిశ్ర, ఆ తర్వాత 4 సంవత్సరాలు న్యాయమూర్తి H.R. ఖన్నా దీనికి అధ్యక్షులుగా ఉన్నారు. ఫౌండేషన్ కార్యాలయం చయన పరిషత్తు సచివాలయంగా కూడా పనిచేస్తుంది. భాషా సమితుల, క్షేత్ర సమితుల విస్తృత సిఫారసులు, పరిశీలనలో ఉన్న రచనల అనువాదాలు, విమర్శలు, వాటికి సంబంధించిన ఇతర సామాగ్రి క్షేత్ర సమితులకు పంపినట్లుగానే సమావేశం జరగడానికి చాలా రోజులు ముందుగానే చయన పరిషత్తు సభ్యులకు పంపుతారు. ఈ సామాగ్రి సాధారణంగా 700-800 పేజీల దాకా ఉంటుంది. అయితే ఇది చదవడానికి, సమావేశానికి సిద్ధపడడానికి తగినంత వ్యవధి వారికి ఉంటుంది. సమావేశాల్లో విద్వత్తుతో కూడిన, స్పష్టమైన చర్చలు జరుగుతాయి. సభ్యులందరు తమ-తమ భాష హితవుకు అతీతంగా ఉంటూ పని చేస్తారు. ఈ సంపూర్ణ చయన ప్రక్రియలో 60కి మించి దేశంలోని ప్రసిద్ధులైన సాహిత్యకారులు పాలు పంచుకుంటారు. ఈ విధంగా ఏ రచనైతే సమ్మాన్ కోసం ఎంపిక చేయబడుతుందో, ఆ రచన సూక్ష్మ పరిశీలన మూడు స్థాయిల్లో జరుగుతుంది. అందువల్లనే ఇన్ని సంవత్సరాల్లో 'సరస్వతీ సమ్మాన్' కోసం తీసుకున్న నిర్ణయాలు సాహిత్య జగత్తులో విమర్శకు గురికాలేదు. నిజానికి వాటిని ప్రశంసించబడమే జరిగింది.

'సరస్వతీ సమ్మాన్' కోసం జరిగే ఎంపికలో ఉన్న విశ్వసనీయతకు, నిష్పాక్షికతకు, ఉన్న ముఖ్యమైన ఆధారం సూక్ష్మమైన, విస్తృతమైన ఈ చయన ప్రక్రియే. మన దేశంలో 'సరస్వతీ సమ్మాన్' భారతీయ జ్ఞానపీఠ్ పురస్కారంతో సమానమైన అత్యంత ప్రతిష్ఠాత్మకమైన సాహిత్య పురస్కారం. 1991లో

ఈ పురస్కారం ప్రదానం చేయడం మొదలైనప్పుడు ఇంత పెద్ద సమ్మాన ధనరాశి (3 లక్షలు) ఇచ్చే పురస్కారం దేశంలో మరొకటి లేదు. ఆ తర్వాత కొంత కాలానికి భారతీయ జ్ఞానపీఠ పురస్కారంతో పాటు ఇచ్చే ధనరాశిని కూడా దీనితో సమానంగా పెంచడం జరిగింది. 'సరస్వతీ సమ్మాన్' కూడా అన్ని విధాలా జ్ఞానపీఠ్ పురస్కారంతో సమానమైందైనా, జ్ఞానపీఠ పురస్కారాన్ని గురించి తెలిసినంతగా అందరికీ దీన్ని గురించి తెలియదు. కారణం జ్ఞానపీఠ్ పురస్కారం ఆరంభమైన (1965) 26 సంవత్సరాల తర్వాత (1991) ఈ పురస్కారం ఆరంభం కావడం కావచ్చు. తెలుగువారి విషయంలో అయితే తెలుగు రచయితకెవరికీ ఈ పురస్కారం లభించకపోవడం కూడా ఒక కారణం కావచ్చు.

సాధారణంగా 'సరస్వతీ సమ్మాన్' చక్కని అభిరుచితో ఏర్పాటు చేయబడిన ఒక సార్వజనిక కార్యక్రమంలో ప్రదానం చేస్తారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించడానికి ఎవరైనా ప్రసిద్ధ రాజకీయ నాయకున్నో లేక సాహిత్యకారున్నో ఆహ్వానిస్తారు. సరస్వతి వందనంతో ఆరంభమయ్యే ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు తన స్వాగతోపన్యాసంతో కార్యక్రమం ఆరంభిస్తాడు. ఆ తర్వాత చయన పరిషత్తు అధ్యక్షుడు లాంఛన ప్రాయంగా సమ్మాన్ పొందిన రచయితను పరిచయం చేస్తాడు. ఆ తర్వాత ఫౌండేషన్ తరపునుంచి, చయన పరిషత్తు తరపునుంచి సన్మాన పత్రం చదవడం జరుగుతుంది. ఆ సన్మాన పత్రంలో సమ్మాన్ కోసం ఆ రచనను ఎంపిక చేయడం వెనక ఉన్న కారణాల సంక్షిప్త వివరణ కూడా ఉంటుంది. ఈ ప్రారంభిక కార్యక్రమం తర్వాత రచయితకు సన్మాన పత్రం, ఫౌండేషన్ జ్ఞాపిక, టెంకాయలతో పాటు సమ్మాన్ రాశి సమర్పించడం జరుగుతుంది. అటుపిమ్మట దుశ్శాలువ కప్పి సంప్రదాయ రీతిలో రచయితను మరోసారి అభినందించడం జరుగుతుంది. ఈ విధంగా లాంఛన ప్రాయంగా సమ్మాన్ సమర్పణ జరిగిన తర్వాత రచయిత, ముఖ్య అతిథి ప్రసంగిస్తారు.

'సరస్వతీ సమ్మాన్' ఒక రచయితను గౌరవించే ప్రణాళిక మాత్రమే కాదు. నిజానికి ఇది భారతీయ సాహిత్య పరికల్పనను బలపరచడానికి, దేశ సాంస్కృతిక ఐక్యతను ప్రోత్సహించడానికి ఫౌండేషన్ దృష్టిలో ఉన్న విస్తృత ప్రణాళికలో ఒక భాగం.

అందువల్లనే ఫౌండేషన్ తులనాత్మక భారతీయ సాహిత్యానికి సంబంధించిన ఏ అంశంపైనైనా లోతుగా అధ్యయనం చేయడానికి ప్రతి సంవత్సరం రెండు స్కాలర్ షిప్పులు ఇస్తుంది. ఈ కార్యక్రమం ప్రకారం కొందరు ప్రముఖ పండితులు, రచయితలు— ప్రొ. అయ్యప్ప పణిక్కర్, నవనీతా దేవసేన్, భోలాభాయ్ పటేల్, ప్రేమశంకర్, జగన్నాథ్ ప్రసాద్ దాస్, E.S. రామకృష్ణన్ మొదలైనవారు— భారతీయ సాహిత్యంలోని వివిధ పార్శ్వాల గురించి విలువైన అధ్యయనం చేశారు. ఒక భారతీయ భాష నుంచి మరో భారతీయ భాషలోకి అనువదించడానికి కూడా ఫౌండేషన్ ఆర్థిక సహాయం అందిస్తుంది. ఈ విధంగా ప్రణాళిక అంతా భారతీయ సాహిత్య అధ్యయనంలో, పరస్పరం ఇచ్చిపుచ్చుకోవడంలో, ఉత్కృష్ట రచనలను గుర్తించడంలో, గొప్ప పాత్రను నిర్వహిస్తుంది.

భారతదేశం ఒక విశాలమైన దేశం. యుగయుగాల నుంచి ఇక్కడ అనేక భాషలు, సాహిత్య రచనలు ఉంటూ వచ్చాయి. అన్ని భాషల్లో ప్రాంతీయ భిన్నత్వం ఉంది. ఒకే దేశంలో భాషకు, సాహిత్యానికి సంబంధించిన ఇంత ఎక్కువ వైవిధ్యం అసాధారణమైంది. అయితే సాంస్కృతికంగా దేశమంతా ఒకటే. మన సంప్రదాయాలు, సామాజిక విలువలు ఒకటే. జీవన శైలి కూడా దాదాపు ఒకే విధంగా ఉంది. మన భాషల్లాగే మన సాహిత్యం కూడా వివిధ రకాలుగా ఉంది. భేదాలున్నా మన సంస్కృతి మాత్రం ఒక్కటే కాబట్టి. భాషలు వేరైనా మన సంస్కృతి ఒకటే. అందువల్ల భారతీయ సాహిత్యం ఒకటే. ఏ ప్రాంతంలోని మౌలిక సంస్కృతి అయినా అక్కడి సాహిత్యంలోనే ప్రతిబింబిస్తుంది. మనం ఇతర భారతీయ భాషల సాహిత్య రచనల గురించి చర్చించినప్పుడు, వాటిని పోల్చినప్పుడు మనకు పరిచయంలేని అంశం గురించి మాట్లాడుతున్నట్లనిపించదు.

అలా అని ఒక ప్రత్యేక సంప్రదాయానికి చెందిన రచనలకే పురస్కారం కోసం ఎంపిక చేయడంలో ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతుందని భావించకూడదు. ఉర్దూలోని 'శేర్ - ఏ - శోర్ అంగేజ్' సాహిత్య సమాలోచనకు సంబంధించిన రచన. దీనికి 1996లో 'సరస్వతీ సమ్మాన్' లభించింది. భారతీయ సమాలోచనా సాహిత్యంలో ఇది ఒక విలక్షణ రచనగా భావించబడింది. సంస్కృతం, అరబీ, యూరప్ సాహిత్య సిద్ధాంతాల ఆధారంగా కవిత్వాన్ని వ్యాఖ్యానించే ప్రయత్నం ఇందులో ఉంది. మన మొత్తం చరిత్రలో సంస్కృతి వేర్వేరు రూపాల సమ్మిశ్రణం ఉంది. ఈ రచన దీనికి సరికొత్త ఉదాహరణ.

అప్పుడప్పుడు రెండు ప్రక్రియల తులనాత్మక అవగాహన చేసుకోవడం చాలా కష్టమవుతుంది. ఒక వ్యాస సంపుటిని కవితా సంపుటితోనో, కథా సంపుటితోనో పోల్చడం సులభం కాదు, జ్ఞానానికి సంబంధించిన ఒక మంచి పుస్తకం మన జ్ఞాన పిపాసను శాంత పరుస్తే, కల్పన పైన ఆధారపడిన సృజనాత్మక రచన మన సౌందర్య సంవేదనను తృప్తి పరుస్తుంది. ఒక సహృదయునికి ఈ రచన వల్ల ఎలాంటి అనుభూతి కలుగుతుంది, అనే దానిపైన ఇదంతా ఆధారపడి ఉంటుంది. ఒక సహృదయుడు ఎలాంటి పక్షపాత దృష్టికి లోనుకాడు. ఒక కళాత్మక రచన ఎంత ఆహ్లాదం కలిగిస్తుందో, ఒక జ్ఞానవర్ధకమైన రచన కూడా అంతే ఆహ్లాదం కలిగిస్తుంది. అందువల్ల చయన పరిషత్తు ఎలాంటి వివక్ష లేకుండా అన్ని రచనల పట్ల ఒకే విధంగా వ్యవహరిస్తుంది, భారతీయ సాహిత్యాభివ్యక్తి వేర్వేరు భాషల్లో జరిగినా విశిష్టమైన దాని ప్రకృతిలో ప్రాథమికమైన ఐక్యత ఉందనే విషయాన్ని బలపరుస్తుంది.

కె.కె. బిర్లా ఫౌండేషన్ ప్రతీక చిహ్నం శుంగ కాలం నాటి సాంచీస్తూపం - Iకి చెందిన వేదికపైన చెక్కిన వికసిత కమలం. కుంభంలో నుంచి పల్లవించిన ఒక సంపూర్ణ మహాపద్మం మధ్యలో ఉంది. దానికిరువైపులా పద్మకలికలు, పద్మ పత్రాలు. అర్ధ వికసిత కమలాలు ఉన్నాయి. మహాపద్మంపైన శ్రీవత్స చిహ్నం ఉంది. సంప్రదాయ విశ్వాసం ప్రకారం శ్రీవత్సం శ్రీమహావిష్ణువు వక్షాన్ని అలంకరించి ఉంటుంది. ఈ ప్రతీక చిహ్నం సృష్టిని, జ్ఞానాన్ని, సమృద్ధిని తెలుపుతుంది.

# లోహియా సోషలిజమ్

- అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి

**(2009 మార్చి 23వ తేదీన డా॥ రామమనోహర లోహియా శతజయంతి సందర్భంగా చైతన్య వేదిక తెనాలి కవిరాజపార్కు, సీనియర్ సిటిజన్స్ భవన్‌లో నిర్వహించిన సభలో మీ సంపాదకుడు ఉపాసక అన్నపరెడ్డి లోహియా సోషలిజమ్ మీద చేసిన ప్రసంగ పాఠం)**

**సోషలిజాలు అనేక రకాలు. డా॥ రామ మనోహర లోహియా రకం సోషలిజమ్ వాటిల్లో ఒకటి. సాధారణంగా సోషలిజం అంటే లేదా కమ్యూనిజమ్ అంటే ఉత్పత్తి సాధనాలు. ఉత్పత్తి పంపిణీల మీద స్వామ్యం సమాజానిదే అని చెప్పే ఆర్థిక రాజకీయ సిద్ధాంతం. ఈ సిద్ధాంతం ప్రకారం Individual is unreal - వ్యక్తి అవాస్తవం, only community is real - సమాజం మాత్రమే వాస్తవం. ఇందులో వ్యక్తిలుప్తమవుతాడు. అయితే లోహి సోషలిజమ్ దీనికి భిన్నం; సోషలిజానికి లోహియా మానవ ముఖాన్ని (human face) గాంధీ ముఖాన్ని తగిస్తాడు. అంతేకాదు, అంతటితో సరిపెట్టకుండ, ఆయన నవ్య సాంస్కృతిక మానవ వాదాన్ని (new cultural (humanism) సోషలిజానికి జోడిస్తాడు. ఈ విధంగా లోహియా గతితార్కిక యాంత్రిక గతిశీల కమ్యూనిజాన్ని కాక, మానవత్వం నిండిన సోషలిజాన్ని బోధిస్తాడు**

**— ఇక చదవండి**

సమాజంలో నేను ఊహించినంతవరకు ఎప్పుడూ గూడ మూడు వర్గాలుంటాయి. ఒకటి ఉన్నవాళ్లు, రెండు లేని వాళ్ళు, మూడు ఉండీలేని అటు ఇటు కాని వాళ్ళు. మొదటి వర్గం సమాజం మారకుండ అలాగే ఉండాలని యథాతథస్థితిని కాపాడాలని ప్రయత్నిస్తారు. ఇహ రెండో వర్గం వీరు సమాజాన్ని కూకటివేళ్ళతో పెకలించి తలక్రిందులు చేయాలని ఉద్యమిస్తారు. మూడో వర్గం ప్రగతిశీల భావాలతో సమాజిక విచ్ఛిత్తికి గాని, సమాజ యథాతథ స్థితికి గాని దారితీయకుండ, ముందుకు నడిపిస్తుంది. సామాజిక పరివర్తన అని వార్యం - social change is inevitable కనుక ఆ మార్పును నాటి సామాజిక బౌద్ధిక వాతావరణానికి (climate of opinion) అనుగుణంగా నిర్వచించుకొనే ఆ దిశలో ప్రయత్నం జరుగుతుంది. ప్రయత్నమైతే జరుగుతుంది కాని, అది సఫల మవుతుందని, సాకారమవుతుందని చెప్పలేం. సామాజిక పరివర్తన మన అధీనంలో లేని అనేక కారకాల (factors) తో ముడిపడి ఉంటుంది.

ఇలాంటి సమయంలోనే సరిగ్గా ఒక గాంధీయో, లోహియాయో అవసరమవుతారు. చారిత్రక వాదాన్ని (Historicism) నమ్మేవారు ఇదొక చారిత్రక ఆవశ్యకత అంటారు. సరిగ్గా ఈ చారిత్రక ఆవశ్యకతను పూరించడానికి భారతదేశ యవనిక మీద గాంధీ, లోహియాలు అవతరణం చేశారు. Both of them made tryst with history. ఇద్దరూ గూడ భారతదేశాన్ని అహింసాత్మక సోషలిజం వైపుకు నడపాలని ప్రయత్నించారు. ప్రయత్నం పూర్తిగా నిండుగా సఫలం కావాలని లేదు. అయితే ప్రయత్నం వల్ల ప్రయోజనం మాత్రం ఉంటుంది. ఇదొక దారి ఉందని భారత ప్రజలకు తెలియజేసింది ఆ ప్రయత్నం.

నా మనసుకు ఎక్కని, పట్టని, మామూలు అన్ని పదాలలాగే, 'సోషలిజం' అనే పదాన్ని ఎన్నో ఏళ్లుగా, ప్రముఖ సిసలైన, సోషలిజాన్ని మనసా వాచా కర్మణా జీర్ణించుకొన్న ప్రాగల్భ్యం లేని నా

మిత్రుడు రావెల సోమయ్య నాకు పరిచయం కాక ముందు నుంచీ వింటూనే ఉన్నా, ఆయన పరిచయంతోనే నా మనస్సు అటువైపు మళ్లింది. ఎప్పుడో 40 సంవత్సరాల క్రితం ఆయన నన్ను కలిసి లోహియా కులం మీద రాసిన "The Caste System" పుస్తకం అనుకొంటాను, గుర్తులేదు, ఇచ్చి, లోహియా చెప్పిన ఒక మాట చెప్పాడు : "నేను గొప్పవాణ్ణి. మరి నాకంటె తక్కువవాడు గూడ ఎవడూ లేడు." ఆ మాటతో నాకు దిమ్మ తిరిగింది. "ఇలా నేను ఎప్పుడైనా ఆలోచించానా? ఎందుకు ఇలా ఆలోచించ లేక పోయాను" అని నాలో నేనే సిగ్గిలాను. అలా సిగ్గిలిన నేను కాలగమనంలో, జీవితంలోని ఒడిదుడుకులు, వ్యవహారాలలో ఆ సిగ్గును విస్మరించాను. సోమయ్య, వారి శ్రీమతి అరుణ మధ్య మధ్య కలుస్తూ, లోహియా ప్రస్తావన తెస్తూనే ఉండేవారు.

కళాశాలలో పిల్లలకు చదువు చెప్పడానికి సోషలిజం అంటే 'ఉత్పత్తి సాధనాలు, పంపిణి, మార్పిలు - మొత్తం సమాజం ఆస్తిగా ఉండాలని, వాటిపై అదుపు సమాజానికే ఉండాలని చెప్పే రాజకీయ ఆర్థిక విధానం. దీనినే అనేక రకాలుగా చెప్పారు: కొందరు అదుపు ఆజ్ఞలేని విఫణి లావాదేవీలకు కళ్ళెం వేయడం అన్నారు. మరికొందరు అరాచక (రాజులేని) వాదమన్నారు. ఏది ఏమైనా 19వ శతాబ్దిలో ఐరోపాలో వచ్చిన సోషలిజాలన్నీ ప్రజాస్వామ్యం వైపుకే మొగ్గి ప్రజాస్వామిక సోషలిజాలయ్యాయి.

సోషలిజం కమ్యూనిజానికి ముందరి దశ అన్నారు. కమ్యూనిజం అంటే అన్ని రకాల ఆస్తి అంతా గూడ సమాజం ఆస్తి అవుతుంది. వ్యక్తికి ఏ రకమైన ఆస్తి ఉండదు. అటువంటి కమ్యూనిస్టు సమాజంలోని ప్రతి ఒక్కడూ తన వ్యక్తిమేర పని చేస్తాడు. అవసరం మేర కావలసింది సమాజం నుంచి తీసుకొంటాడు. ఇటువంటి కమ్యూనిజం 1917 విప్లవం తరవాత రష్యాలో బోల్షివిక్కులు రూపొందించారు.

దీనికి దగ్గరగా ఉండేది, కమ్యూనిజానికి మూల భూమిక అయిందీ మార్క్సిజం. సామాజిక పరివర్తనను ఆర్థిక కారకాలతో వివరించే సిద్ధాంతమే మార్క్సిజమ్. ఉత్పత్తి సాధనాలు ఆర్థిక భూమికను రూపొందిస్తాయనీ, ఈ ఆర్థిక భూమిక రాజకీయ, ఆదర్శాత్మక సామాజిక ఉపరితల నిర్మితులకు దోహదం చేస్తుందని చెబుతుంది. మార్క్స్, లెనిన్‌లు, వారి అనుచరుల సిద్ధాంతాలతో కమ్యూనిజానికి నిర్మించిన భూమికయే మార్క్సిజమ్.

ఆధునిక కమ్యూనిజమ్ మూల భావాలకు మూలం 1516లో థామస్ మోర్ రాసిన ఉటోపియా (ఆదర్శ రాజ్యం)లో ఉన్నా, అంతకు ముందు ఈ భావాలు ఎప్పటి నుంచో ప్లేటో కాలం నుంచి, అంతకు ముందే బుద్ధుని కాలం నుంచీ ఉన్నాయి. ప్లేటో అయితే ప్రజలు, ఆస్తి, అన్నీ గూడ రాజ్యానికి చెందుతాయన్నాడు. "నీ భార్య ఏమిటి? నా భార్య ఏమిటి, వారు అందరి భార్యలు" అని కమ్యూనిజమ్ ఆఫ్ వైవ్స్‌నే తన ఆదర్శ రాజ్యం (Republic) లో ప్రతిపాదించాడు. అంతకు ముందు బుద్ధుడు క్రీ.శ. ఆరో శతాబ్దిలో స్థాపించిన భిక్షు సంఘంలో వ్యక్తిగత ఆస్తికి చోటు లేదు. ఎవరైనా దానాలిస్తే, అవన్నీ సంఘం ఆస్తి - అవుతుంది. భిక్షువుకు ఉండే ఆస్తి రెండు జతల పాంశుకూలా (చిరిగిన గుడ్డ పేలికల అతుకులతో కుట్టిన వస్త్రాలు) ఒక చిప్ప, సూది, దారం మాత్రమే. ప్లేటో తన కమ్యూనిజాన్ని తన "ఆదర్శరాజ్యం" (Republic) అనే గ్రంథంలో ప్రతిపాదన మాత్రమే చేస్తే, బుద్ధుడు తన కమ్యూనిజాన్ని ఆచరణలో పెట్టాడు. నాటికీ నేటికీ చారిత్రక యుగంలో

ఇంతటి గుణాత్మక కమ్యూనిజాన్ని ఈ భూమండలంలో ఆచరణలో పెట్టిన వాడు ఒక్క బుద్ధుడే. అంతకు ముందు ప్రాక్ చారిత్రక కాలంలో ఆదిమ కమ్యూనిజమ్ ఉంటే ఉండ వచ్చు.

## లోహియా మానవీయ సోషలిజమ్

ఇంతకు ముందు కమ్యూనిజమ్ అంటే ఏమిటో, సోషలిజమ్ అంటే ఏమిటో, స్థూలంగా నిర్వచనాత్మకంగా వివరించడం జరిగింది. అసలు ఇలా ఎందుకు చెప్ప వలసి వచ్చిందంటే ఇంతకు ముందు చెప్పిన సోషలిజంలో మానవ ముఖం - వ్యక్తి ప్రతిమ - కనిపించదు. కమ్యూనిజంలో "వ్యక్తిగత ఆస్తి"తో పాటు 'వ్యక్తి' లుప్తమవుతాడు. సమాజమే ఉంటుంది. కాని అందులో వ్యక్తి కాన రాడు. ప్రజాస్వామ్యం, మెజారిటీ, మైనారిటీలు, వ్యక్తుల అభిప్రాయాలు కనిపించవు.

మరి లోహియా సోషలిజమ్ సోషలిస్టు మౌలిక భావనను వీడకుండానే, దానికి ప్రజాస్వామికాన్ని, మానవ ముఖాన్ని (Human face) కలిపాడు. ఈ దిశగానే ఆయన నవ్య సాంస్కృతిక మానవ వాదాన్ని (New cultural humanism) అన్వేషించాడు. ఈ అన్వేషణలో ఆయనకు ఏమి దొరికిందో ఏమి దొరకలేదో చూదాము.

మనకు భారతదేశంలో సోషలిస్టు ఉద్యమం అనగానే గుర్తుకొచ్చేవారు జయప్రకాశ్ నారాయణ, అచ్యుత పట్వర్థన్, మధులీమయే, ఆచార్య నరేంద్రదేవ్, ఆచార్య కృపలానీ, అరుణా అసఫాలీ, మధుదండావతే మొదలైనవారు. Socialistic Pattern of Society భావనను ప్రవేశపెట్టిన నెహ్రూను గూడ ఈ వర్గంలో చేర్చ వచ్చు. "స్వభావరీత్యా మానవుడు స్వార్థ జీవి. తనగోల తనది తప్ప, అన్యాన్ని పట్టించుకోడు" అని థామస్ హాబ్స్ చెప్పినా, ఇది అందరి యెడ వర్తించదు. జయప్రకాశ్ నారాయణ, లోహియాలకు ఈ సూత్రీకరణ వర్తించదు. జయప్రకాశ్ నారాయణ కరుణామయ హృదయం, మానవతా దృక్పథాలు - మానవాళి శాంతి సుఖాలతో, సౌభ్రాత్వత్వంతో వికసించాలని ఆక్రోశించాయి. సామాజిక పునర్నిర్మాణానికి అవసరమైన ఉదాత్త ఆదర్శాలైన న్యాయం, సమత, స్వేచ్ఛల కోసం అహరహం తన డెబ్బది ఏడు ఏడుల జీవితకాలం శ్రమించాడు. 20వ శతాబ్దిలోకే భారతదేశంలో ఉద్భవించిన రాజకీయ చింతనలో అంతటి గొప్పవాడు మరొకరు కాన రారు. ఈయన కాంగ్రెసు లోపలే ఉండి, కాంగ్రెస్ 'నత్తనడక' వ్యవహారం నచ్చక, తోటి సోషలిస్టులైన లోహియాలాంటి సహచరగణంతో, కాంగ్రెస్ సోషలిస్టు పార్టీని 1934లో స్థాపించాడు. ఏది ఏమైన ఈ కాంగ్రెస్ సోషలిస్టు గ్రూపు 19వ శతాబ్దిలో ఐరోపా నుంచి దిగుమతి అయిన సోషలిస్టు భావాలను యథాతథంగా స్వీకరించడానికి సుముఖంగా లేదు. ఐరోపా సంస్కృతి వేరు. భారతీయ సంస్కృతి వేరు. వాటి నేపథ్యాలు వేరు. అవసరాలు వేరు. ఈ తేడాలను గుర్తించిన ఈ సోషలిస్టు వర్గం ఐరోపా సోషలిజానికి భారతీయ పరిస్థితులకనుగుణంగా పరివర్తించి, దానికి మానవముఖాన్ని జోడించారు. దీనితోపాటు ఈ వర్గం గాంధీలోని "గాంధీతనాన్ని" పూర్తిగా నిరాకరించకుండ, దానిలో "కొంత"ను తమదిగా చేసుకొన్నారు. అందుకే జయప్రకాశ్ ఒకచోట "నా దృష్టి" స్వేచ్ఛాయుత ప్రగతి శీల, గాంధీ ఇండియా", అంటాడు. గాంధీ ఇండియా అనడంలో ఈ సోషలిస్టు వర్గం సోషలిస్టు దృష్టి మనకవగతమవుతుంది. తమ సోషలిస్టు పంథాను అవ్యవహితంగా ఆచరణలో పెట్టాలని ఈ వర్గం పట్టుబట్టి, అది కుదరక పోవడంతో, తమను కాంగ్రెసు వేరుగా చూస్తోందని

భావించి, త్వరపడి, 1947కే, గాంధీ, నెహ్రూల సలహాలకు వ్యతిరేకంగా, చీలు బాట పట్టింది. ఈ విధంగా చేయడంలో, కాంగ్రెసులోని శీలరహిత, స్వార్థ పరశక్తుల విహారానికి స్వేచ్ఛ దొరికింది. అంతేకాదు, అలా విడిపోవడంతో వీరూ ప్రజలకు దూరమయ్యారు.

జయప్రకాశ్ నారాయణ సతతా నిరుద్వేగిక చింతనుడు మేధావి అయితే, లోహియా ఔద్వేగిక మేధావి. ఆలోచనా స్పష్టతలో, ఔద్వేగికంగానే ఆలోచించినప్పటికీ, అతని కంటె మరొకరిని చెప్పడానికి లేదు. పారదర్శకత ఉంది. ప్రతీకాత్మకాలోచనా ప్లుతి (Flights of imagination) ఉంది. లక్ష్యాన్ని స్పష్టంగా చూసి, అవగాహన చేసుకొనే ధైర్యం ఆయన సొత్తు. అటువంటి లోహియా సుదూర తీరాలలో "నవ్య సాంస్కృతిక మానవ వాదాన్ని దర్శించాడు. ఆ దర్శనాన్ని మనకు పూర్తిగా అందించకుండానే త్వరపడి, 1967లో మరణించాడు. ఏమిటి ఆ నవ్యాదర్శం?

సమాజ హితం, దేశ స్వాతంత్ర్యం, సంపదంతా సమాజ పరం - అనే ఆదర్శాలను, విజ్ఞాపనలు, మొత్తుకోళ్ళతో సాధించలేం, విప్లవించ వలసిందే అన్నాడు లోహియా. నెహ్రూ ఏమో గెరిల్లా విప్లవ పద్ధతిని అనుసరించాలన్నాడు. కాని దానిని తిరస్కరిస్తూ, అహింసాయుత విప్లవం చేపట్టాలన్నాడు. విప్లవం అంటే కత్తులు కటారులు దూయడం కాదు, తుపాకి గొట్టాలు ఎక్కుపెట్టడమూ కాదు. అది శాంతియుతంగా ఉండాలి. అదే సమయంలో భావపరంగా విప్లవాత్మకంగా ఉండాలి. దీనికి గాంధీ మార్గం అనుసరణీయం అన్నాడు లోహియా. జైళ్ళలో తనకు హింస అంటే ఏమిటో తెలిసి వచ్చింది. దానిని తానొక యౌగిక అనుభవంగా మార్చుకొన్నానన్నాడు. అంటే హింసను అధిగమనం చేసి చూడ గలిగాడు.

తన అహింసా పద్ధతిలోనే - భారత్, పాక్‌లు విడిపోవలసి వస్తే విడి పోనీండి - కాని అవి రెండూ విడివిడిగా ఉంటూనే సమైక్య రాజ్యంగా ఒక Confederateగా ఉండాలన్నాడు. ఇది ఆయన వసుధైక ఆదర్శానికి ఒక మచ్చు. గాంధీతో పాటు మత కలహాల నిరోధానికి తన వంతు కృషి చేశాడు. "మతం' మనుషులను చీలుస్తుంది, కాని మానవత మనుషులను కలుపుతుంది", అని అనుకొని మానవత కోసం మత కలహాల మధ్య నిలచి వాటిని చల్లార్చ ప్రయత్నించాడు.

లోహియా గురించి గాంధీ ఇలా అన్నాడు ఒకసారి : "లోహియా, నీవు సాహసివి. సాహసానికేముంది, అది అడవి పులులకూ ఉంటుంది. అవి సాహసులు కావా? నీవు మహాజ్ఞానివి. జ్ఞానానిది ఏముంది, అది న్యాయస్థానాల్లోని న్యాయవాదులు దగ్గరా ఉంది. వీటన్నింటినీ మించి నీకు శీలం (Charecter) ఉంది".

దానవ దమన నీతిని అధిగమించిన మానవుడుగా, మానవుని శక్తులు పరిమితాలని ఎరిగి, ఆ పరిమితులను చెరిపి వేసి, అపరిమేయ మానవుడుగా జీవించాలని, తన ఆదర్శాలను, తను కన్న కలలను పండించు కోవాలని, సాక్షాత్కారం చేసుకోవాలని అహరహం శ్రమించి, విశ్వమానవునిగా ఎదిగి, మానవునికి నిర్వచనమై ప్రపంచ మానవాళి హృదయానికి వారసుడయ్యాడు. గాంధీ అహింసాయుత మార్గాన్ని రాజకీయ పరివర్తనకు సాధనంగా ఎంచుకొన్న లోహియా, తన సామాజికాదర్శానికి, అందుబాటులోకి వస్తున్న నూతన సాంకేతిక, విజ్ఞాన శాస్త్రాల విజ్ఞానంతో జోడించి, దానిని పూర్తిగా మానవీకరించాల (Humanise)ని నిర్ణయించు కొన్నాడు. నవీన విజ్ఞాన శాస్త్ర సాంకేతిక రంగాలు సృష్టించిన మారణాయుధాల వలని ముప్పును ఆయన గుర్తించాడు. ఎప్పుడో 2000 సంవత్సరాల క్రితం భారతీయ గణితవేత్తలు కనుగొన్న 'సున్న' తరవాత తరవాత

అది ఉమ్మడీకరణం చెంది, మానవాళి సొత్తు అయింది. అదే విధంగా ఆధునిక విజ్ఞాన శాస్త్రాలు మానవాళి ఉమ్మడి సొత్తు కావాలన్నాడు. ఇది ఆయన నవ్య సాంస్కృతిక మానవ వాదానికి సూచించిన ఉపచారం.

లోహియా "ఆదర్శాన్ని పండించుకోవడం", (Actualisation of the ideal = ఆదర్శ సాక్షాత్కారం) అనే పదాన్ని తరచు ఉపయోగించేవాడు. మనం మన సామాజిక విప్లవ ఆదర్శ సాక్షాత్కారంలో ఎందుకు విఫలమవుతున్నాం? వాస్తవంగా మనం ఉన్న తీరేమిటి (What is)? ఎలా ఉండాలి (What ought to be): అనే రెండింటిని గుర్తించి గూడ వాటి రెండింటిని కలిపి, నేసి, దానిని అలవాటు చేసుకోవాలి. ఇక్కడ మనం మానవ బలహీనతల, పక్షపాత ధోరణుల, దృష్టిగతులం కావడం (వివిధ సిద్ధాంతాలను అంటిపెట్టుకొని వాస్తవాన్ని చూడ లేక పోవడం)వల్ల విఫలమవుతున్నాం, అన్నాడు లోహియా. దీనిని ఆచరణకు పెట్టడంలో నిజంగా ఆయన హీరోయే అయ్యాడు.

నిర్వికల్ప సమాధి స్థితిలో మనస్సు పని చేయదు. అంటే ఆలోచనలు, దృష్టులు, ఆవేశకావేషాలు ఏమీ ఉండవు. కేవలం అనుభవం మాత్రమే ఉంటుంది. అది ఒక్కక్షణమే కావచ్చు. ఆ క్షణంలో అతడు సత్యాన్ని చూస్తాడు. ఈ సత్యం అందరికీ సమానమే. సరిగా ఈ సమయంలో సాత్విక శక్తి మనస్సును మంచి విషయాల, సత్కర్మల వైపు మళ్ళిస్తుందని ప్రాచీన యోగులు చెప్పారు. ఇదే మానవాళిని ఏకత్రాటి పైకి తెచ్చే శక్తి. వీటిని మనం అంగీకరించినా, అంగీకరించకపోయినా, పైవిధంగా మనిషిలో ఉన్న అంతర్గత శక్తులను గుర్తించి వాటిని బయటికి తెచ్చి, యథార్థీకరిస్తే మానవాళికి మోక్షం ఉంటుందని ఆయన విశ్వసించాడు. లోహియా రకం సోషలిజానికి రెండు ముఖ్యాంశాలున్నాయి : వ్యక్తి నిర్మాణం, జాతిశీల నిర్మాణం. ఈ రెండే కాక ఇంక కొన్ని సాంస్కృతికాంశాలను గూడ చేర్చాడు : "అటువంటి మానసిక స్థితి (నిర్వికల్ప సమాధ్యవస్థ) ధ్యానం చేయడం ద్వారా మాత్రమే సాధ్యం. నాకై నేను ఎప్పుడూ ధ్యానం చేయక పోయినా, నన్ను విపరీత బాధలకు గురిచేసిన జైలుగదిలో అదినాపై రుద్దబడింది. (ఆ బాధలననుభవిస్తున్న సమయంలో యౌగిక అనుభవం పొందాడని ముందే చెప్పాము) ఆ అనుభవదశలలో ఒకడు తాను చేయ బోతున్న మహాకార్యాలను గురించి, తను చేసిన పనులలలో దోషాల గురించి, వాటి సంబంధంగా కలిగిన పరితాప, పశ్చాత్తాపాల గురించి ఆలోచిస్తాడు. అటువంటి సమయాలలో ఒకక్షణం ఎదురవుతుంది. అది నిలబడుతుంది. దానిని అతడు వదలడు. ఆ విధంగా కాలాన్ని నిలవరిస్తాడు. కొంతమందికి స్వప్రయత్నంతో ఈ మానసిక సమతౌల్యస్థితి సాధ్యమవుతుంది. ప్రకృతి ఎంపిక చేసిన, విధితో సమాగమం (Tryst) నిశ్చితమైన వారిలో లోహియా ఒకరని భావించవచ్చు. ఈ విధంగా చూసి నప్పుడు జైలు పీడనా సన్నివేశం అంత ముఖ్యమైందని అనుకోనక్కరలేదు.

అటువంటి క్షాళిత మనస్కుడైన లోహియా తన నవ్య సాంస్కృతిక ఉద్యమానికి జాతి చరిత్ర (ఇక్కడ చరిత్ర అంటే శీలం = Charecter), రుజువర్తన (Probity), సమాజసేవకు అంకితం కావడం సరళ జీవితం గడపడం, ఉన్నదాంట్లోనే సరిపెట్టుకొని జీవించడం లాంటి ప్రవర్తన నియమావళిని నిర్దేశించాడు. లోహియా ఉద్దేశంలో అసలు సంస్కృతి అంటేనే చరిత్ర నిర్మాణం (శీల నిర్మాణం). పిల్లలు చరిత్ర హీనులు కావడానికి స్కూళ్ళు, పెద్దలు శీల సంబంధ విద్యను

గరపక పోవడం. డబ్బు సంపాదించడం ఎలా? సమాజంలో ఉన్నత స్థితిని చేరడం ఎలా? మొదలైన విషయాల గురించే వారు పిల్లలను తయారు చేస్తున్నారని లోహియా వాపోతారు.

ఏ మానవుడైన కోరుకొనేది సుఖశాంతులే. సుఖం అంటే ఆయన దృష్టిలో సంపదను కూడబెట్టడం కాదు, ఆరోగ్యవంతమైన విలువలతో గూడిన వ్యక్తి ప్రతిష్ఠ. తనకోసం, కుటుంబం కోసం, సమాజం కోసం పాటుపడుతూ సాధారణ గౌరవ ప్రద జీవితాన్ని గడపడం వ్యక్తి స్వేచ్ఛ, మత (ధర్మ) విశ్వాసం, తనుకోరుకొన్న వృత్తి - ఇవీ శాంతిని ఇనుమడింపజేసేవి. ఇది సుఖానికి ఒక కొలత. సమాజ క్షేమం కోసం పాటు పడడం సుఖానికి మరో కొలత. తనకోసమే వండుకొని తను మాత్రమే తింటే, అతడు అంత పాపాన్ని మూట గట్టుకొంటున్నాడు అని ప్రాచీన భారతీయ స్మృతుల వాక్యాన్ని వాకొంటాడు లోహియా. ఏ నాయకుని శీలం (చరిత్ర) అయినా శుద్ధంగా ఉండాలి. ఎందుకంటే ప్రజలంతా అతడిని అనుకరిస్తారు, అనుసరిస్తారు. అతని శీలం శుద్ధం కాకపోతే ప్రజలంతా భ్రష్టు పట్టి పోతారు.

మానవుల ప్రాథమిక అవసరాలు తీరితే చాలని గాంధీ అంటే, లోహియా దానిని ఇలా తిరగ రాసి ఆధునికీకరిస్తాడు: గాంధీ అంటాడు: మానవుల ముఖ్యావసరాలు తీరడానికి కావలసినంత ఉంది, కాని వారి కోరికలు తీర్చడానికి మాత్రమే చాలి నంత లేదు. అవసరాలతో మనిషికి ప్రమాదం లేదు, వచ్చిన ప్రమాదం అంతా కోర్కెలతోనే. ఎలాగంటే ఒక కోరిక తీరినంత మాత్రాన మనిషి సంతృప్తి చెందడు, మరొక కోరిక వెంటనే పుట్టుకొస్తుంది. కోరిక తీరడం అంటే అగ్నిని ఆర్పడానికి, నేతిని పోయడమే అవుతుంది.

అయితే లోహియా గాంధీలా ప్రాథమికావసరాలు తీరడంతో సంతృప్తి చెందడు. మనిషికి ఒక సరళ సామాన్య వినీత జీవితం కావాలంటాడు. దీనికి ఆధునిక సాంకేతిక శాస్త్రాల సాయంతో సంపదను పెంచాలంటాడు, అది అందరికీ అందాలంటాడు. బుద్ధునిలా సహజ జ్ఞానం (Intuition)తో ఒక మాదిరి అంటే మధ్యరకం (బుద్ధుడు ఏ అంత్యానికి అంటుకోకుండ మధ్యేమార్గంలో నడవమన్నాడు)గా ఏ అంత్యానికి అంటిపెట్టుకోకుండ, దొరికిన వాటితో జీవించే సత్యాన్ని అనుసరించమన్నాడు లోహియా.

లోహియా చాల గొప్పవాడు. అసాధారణ శీలం (చరిత్ర) కలవాడు. కార్యశూరుడు. అద్భుతమైన చింతనుడు. నాలుక బహుపదునైంది. శీలశుద్ధిలో ఛాందసుడు. అందుకని బహుశా భారతీయ, విదేశీయ శిష్ట పత్రికలేవి ఆయన్ను పెద్దగా పట్టించుకోలేదు. దీనికి కారణం ఆయన ఎప్పుడు ఏమి మాటాడుతాడో ఊహించ లేక పోవడం కావచ్చు. బహుశ తనకున్న విజ్ఞతా స్థాయి ఆ పత్రికలకు లేదని ఆయన భావించడం వల్లనేమో.

సాపేక్షంగా చూస్తే అతడు ఏకాకే. అనుచరణగణం, ప్రశంసించే గణం ఉంది, కాని ఆయనకు మిత్రులు ఎవరూ లేరు. ప్రజలను ఆయన దూరం చేసుకొన్నాడా? ఆయన్ను ప్రజలు దూరం చేసుకొన్నారా?

ఏదిఏమైనా లోహియా మాత్రం అసాధారణ వ్యక్తి. కాని అతడు అసాధారణ నాయకుడనడంలో ఎవరికీ సందేహం ఉండాల్సిన పనిలేదు.

(Remembering Lohia - అనే రాబోయే గ్రంథం నుంచి కొంత విషయం గ్రహించడం జరిగింది)

# లోక హితవాది లోహియా

## (డా॥ లోహియా శతజయంతి ఉత్సవాల సందర్భంగా)

- యు. శివలింగం

డాక్టర్ రామ మనోహర్ లోహియా విశిష్ట గుణ సంపన్నుడు. విలక్షణ మనస్తత్వం. నిరంతర పోరాట జీవి. బహు గ్రంథ అధ్యయనశీలి. రాజకీయాల్లో వివాదాస్పద వ్యక్తి. అంతర్జాతీయ దృక్పథం గల జాతీయవాది. హృదయం మృదులమే, పలుకు వజ్ర సదృశం. దోషాలు, లోపాలు ఎక్కడ ఉన్నా సహించలేడు. ఉద్విగ్న మనస్సు. ఆలోచన కన్నా ఆవేశం ఎక్కువ. లోక వ్యవహార సిద్ధుడు.

లోహియా 1910 సం॥ మార్చి 23వ తేది ఉత్తరప్రదేశ్‌లోని ఫైజాబాద్ జిల్లాలోని అక్బర్‌పూర్‌లో జననం. పూర్వీకులు లోహ వ్యాపారం చేసేవారు వైశ్యులు. అది కుటుంబ నామంగా ఏర్పడింది. తండ్రి హీరాలాల్, తల్లి చంద్రి. చిన్నతనంలోనే తల్లి మరణించింది. తండ్రి స్వాతంత్ర్య సమరంలో క్రియాశీల కార్యకర్త. దర్శన సత్యాగ్రహంలో పాల్గొన్నాడు. తండ్రి చాటుబిడ్డగా లోహియాకు జాతీయ పోరాటం పట్ల అభిలాష, సమాజంపట్ల ఆసక్తి సంక్రమించాయి. ప్రాథమిక విద్య అక్బర్‌పూర్. బొంబాయి మార్వారీ విద్యాలయంలో మెట్రిక్. వారణాసి కాశీ విద్యాలయంలో ఇంటర్ విద్య. 1929 విద్యాసాగర కాలేజి కలకత్తాలో బి.ఎ. పట్టా. 1929లో తిలక్ మరణించిన సందర్భంగా జరిగిన సమ్మెలో ముందున్నాడు. 1928లో సైమన్ కమిషన్ వ్యతిరేక సభకు బాలలోహియా అధ్యక్షుడు. సుభాష్‌చంద్రబోస్‌కు, జవహర్లాల్ నెహ్రూకు సన్నిహితుడు. ఉన్నత విద్య కోసం ఇంగ్లండు వెళ్ళినా మనసొప్పలేదు. జర్మనీ వెళ్ళి బెర్లిన్ విశ్వవిద్యాలయంలో ఉప్పుసత్యాగ్రహం అనే అంశం మీద థీసిస్ రాసి డాక్టరేట్ పుచ్చుకున్నాడు. జర్మనీలో హెగెల్‌ను, మార్క్స్‌ను కూలంకషంగా అధ్యయనం చేశాడు. నాజీ దురహంకారాన్ని సోషల్ డెమోక్రాట్ల అసమర్థతను, కమ్యూనిస్టుల విద్రోహచర్యల్ని అనుభవపూర్వకంగా పరిశీలించాడు. 1933లో నాసిజానికి, పెట్టుబడిదారీ విధానానికి, సామ్రాజ్య వాదానికి వ్యతిరేకిగా మాతృభూమిలో అడుగుపెట్టాడు.

1936 నుండి 1938 వరకు కాంగ్రెసు విదేశాంగ వ్యవహారాల కార్యదర్శిగా భారతదేశ విదేశాంగ విధానాన్ని చక్కదిద్దాడు. 1939లోను, 1940లోను యుద్ధ వ్యతిరేక ప్రచారం చేసి అరెస్టు అయినప్పుడు న్యాయస్థానంలో తన కేసును తానే వాదించుకున్నాడు. 1942 ఆగస్టు 9వ తేదీన నాయకులను అరెస్టు చేస్తుండగా లోహియా తప్పించుకున్నాడు. జయప్రకాష్ నారాయణ్ హజారి బాగ్ జైలు నుంచి తప్పించుకున్నాడు. లోహియా, జయప్రకాష్ కలిసి చేసిన సాహసోపేతమైన చర్యలు భారత విప్లవోద్యమంలో చిరస్మరణీయ ఘట్టాలు. ఎన్నో చిత్రహింసలను అనుభవించాడు. 1944లో గాంధీ, 1945లో నెహ్రూలు విడుదలయ్యారు. లోహియా, జయప్రకాష్‌లను విడుదల చేయలేదు. బ్రిటన్‌లో ఎన్నికలు జరిగి లేబరు పార్టీ ప్రభుత్వం ఏర్పడ్డాక 1946 ఏప్రిల్ 11వ తేదీన విడుదలయ్యాడు. గోవా విమోచనోద్యమానికి నాంది పలికింది లోహియా. దేశ విభజనను వ్యతిరేకించాడు. కాంగ్రెసు

యు. శివలింగం, పడమరవీధి, చల్లపల్లి - 521 126, కృష్ణాజిల్లా.

కార్యవర్గంలో లోహియా, జయప్రకాష్‌లు దేశ విభజన ప్రయత్నాలను చివరి వరకూ ప్రతిఘటించారు. భారతమాత సమగ్ర స్వరూపం సాధించబడకపోదనే ఆశాభావాన్ని వ్యక్తం చేసే సవరణను తీర్మానంలో చేర్పించిన ఘనత లోహియాదే.

1962లో చైనా భారతదేశం మీద దురాక్రమణ చేసినప్పుడు నెహ్రూ ప్రభుత్వం ప్రతిఘటించలేక పోయింది. ప్రభుత్వాన్ని తక్షణం తొలగించాల్సిన సమయం ఆసన్నమైందని విశ్వసించాడు లోహియా. 1963లో ఫరూకాబ్ ఉప ఎన్నిక ద్వారా పార్లమెంటులో ప్రవేశించాడు. ప్రతిపక్షాలను సమైక్య పరచడానికి కృషి చేశాడు. 1967 ఎన్నికలలో కాంగ్రేసేతరవాదం సత్ఫలితాలనిచ్చింది.

1967 అక్టోబరు 12వ తేదీన విజయదశమినాడు డా॥ లోహియా అవివాహితుడుగా మరణించాడు. కర్మయోగిగా జీవించాడు. సొంత ఇల్లు లేదు. కొన్ని రోజులు బిర్లాతో, తరవాత జమునాలాల్ బజాజ్ ఇంట్లో ఉండగా ఒకరోజు చెప్పకుండా పారిపోయాడు. బజాజ్ కుమార్తెనిచ్చి వివాహం చేయాలనుకోవడమే అందుకు కారణం. సంసార బంధంలో ఇరుక్కోవడం ఇష్టం లేదు.

తనకు నచ్చని విషయం పట్ల వెంటనే స్పందించి అసహనాన్ని ప్రదర్శిస్తాడనడానికి చిన్నప్పటి ఉదాహరణ. 1930లో నానారాజ్య సమితిలో బికనీర్ మహారాజు భారతదేశంలో బ్రిటీషు పాలనాశ్రేష్టత్వాన్ని గురించి ఉపన్యసిస్తున్నప్పుడు ప్రేక్షకుల గ్యాలరీ నుంచి ఈల వినిపించింది. సమితి అధ్యక్షుడు సదస్యులు చకితులై చూస్తున్నారు. అబద్ధాల ప్రసంగానికి అసమ్మతిగా లోహియా ఈల వేశాడు. ఆయనను బలవంతంగా బయటకు పంపించారు. ప్రసంగం వినాలని బెర్లిన్ నుంచి జనీవా వచ్చాడు. వయసు ఇరవై, బెర్లిన్ వెళ్ళినప్పుడు జర్మన్ భాష లోహియాకు రాదు. ఇంగ్లీషు పనికిరాదు. మూడు నెలల్లో జర్మన్ బాష నేర్చుకుని ఆచార్య జాంబర్టుతో అనర్గళంగా మాట్లాడగలిగిన ప్రతిభావంతుడు.

సమీక్షాత్మక దృష్టితో కూడిన సృజనాత్మక ప్రతిభ అపారం. ఏ విషయం గురించైనా రాయగలడు, మాట్లాడగలడు. 1933లో జర్మనీ నుంచి స్వదేశం వచ్చి మద్రాసులో ఓడ దిగి డబ్బేమీ లేకపోవడం వలన హిందూ పత్రిక కార్యాలయానికి వెళ్ళి, సంపాదకుని కలిసి ఒక వ్యాసం ఇస్తానని చెప్పాడు. తెచ్చారా అని అడిగాడు. వెంటనే కాగితాలు పెన్సిలూ తీసుకుని వ్యాసం రాసి ఇచ్చాడు. ఆయన ప్రతిభకు ముగ్ధుడయ్యాడు సంపాదకుడు.

సర్వతోముఖమైన అభిరుచులున్న వ్యక్తులుగా జవహర్లాల్, లోహియాలు కనిపిస్తారు. నెహ్రూ ఆవేశరహిత మధుర ప్రశాంత సమాలోచనలయితే, లోహియా భావాలు ఉద్విగ్న తరంగాలు. ఆవేశపూరితాలు. అందుకే ఆయన రచనలు క్రమబద్ధంగా తర్కసమ్మతంగా సాగలేదంటారు. సకలద్వంద్వాలు, వైరుధ్యాల వెనుక ఏకత్వ సాధన కోసం చేసే తపన దాగి ఉంది. లౌకిక ఏకత్వం ఎండమావి, తాత్కాలికం. మహాత్మాగాంధి జీవించినంత కాలం భారత జాతీయ కాంగ్రెసును సమాజవాద లక్ష్యసాధనగా మళ్ళించాలని ఆశించాడు.

గాంధీజీ హత్యానంతరం అది జరగలేదు. కాంగ్రెసు నుండి బయటికి వచ్చాడు. ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిని అన్వేషించారు. లోహియా మార్క్సును, యూరప్, అమెరికా సోషస్టుల రచనలను అధ్యయనం చేశాడు. మార్క్సు ఆర్థిక సిద్ధాంతాలను విమర్శనాత్మకంగా వివరిస్తూ రచనలు చేశాడు. ఆర్థిక పెట్టుబడిదారి విధానపు అంతిమదశ సామ్రాజ్య వాదం అని సూత్రీకరించాడు లోహియా. మార్క్సు ఆర్థికాన్ని చేపడితే, రసెల్ అధికారాన్ని గురించి రాశాడు. అధికారం స్వేచ్ఛను హరిస్తుంది. అధికారకాంక్షతో రాజకీయ పక్షాలు మానవ స్వాతంత్ర్యాన్ని భక్షిస్తాయి. తాత్విక చింతన ఉంటేనే స్వతంత్ర విచారం ఉద్భవిస్తుంది. మార్క్సు కలలు కన్నట్టే లోహియా కూడా వ్యక్తిగత ఆస్తి మానసికంగాను భౌతికంగాను రద్దు పరచగల మరింత మహోన్నత సిద్ధాంతం వ్యాప్తిలోకి రావాలని ఆశించాడు. ప్లేటో నుండి బెల్లామి వరకు ఆదర్శ రాజ్యాలను ఊహించారు. ముఖ్యంగా నగరంకు సంబంధించినవి. గాంధీవి గ్రామీణాభివృద్ధికి సంబంధించిన ఆలోచనలు. బుద్ధుడు, క్రీస్తుకన్నా మహాత్మాగాంధీ వాక్యాలు చాలా స్పష్టంగా ఉంటాయంటాడు.

సిద్ధాంత గ్రంథంగా రాసిన మహాత్మాగాంధీ ఏకైక గ్రంథం 'హింద్ స్వరాజ్'. గ్రామరాజ్యం గ్రామ గణతంత్రాలను గురించి గాంధీజీ కన్నకలలు కల్లలైనాయి. సమాజవాద భావాలతో గాంధీజీ జీవితం కార్యాచరణకు సంబంధించిన కొన్నింటిని మిళితం చేసి నాణ్యమైన సమాజ వస్త్రాన్ని నేయగలిగితే నవనాగరికత ఆవిర్భవించి మానవాళికి శాంతి, సలక్షణమైన జీవన ప్రమాణాలను సాధించి పెట్టగలదన్నాడు. సమానత్వం మీద మంచి ఉపన్యాసం రాశాడు. ఆధ్యాత్మిక శిక్షణ వల్ల సంస్కారాన్ని పెంచుకోవడం వల్ల జయాపజయాలు సుఖదుఃఖాలకు సంబంధించిన అనుభవాలను గ్రహిస్తూ ఆనందానుభూతిని పొందగలడు. ఆచరణాత్మక ఆధ్యాత్మికత భారతీయ సంప్రదాయంలో కనిపిస్తుంది. ఉపనిషత్తుల్లో, బౌద్ధ దర్శనలోను ఆచరణలోను, భక్తి ఉద్యమాల్లో, వివేకానందుని ఆచరణాత్మక వేదాంతంలోను, అరవిందుని దివ్య జీవనంలో, గాంధీ సత్యాన్వేషణలో, విముక్తి పోరాటాల్లో Practical Spirituality పతిబింబిస్తుంది. లోహియాది ప్రవిత్ర గ్రంథం లేని, కులం లేని, సమానత్వాన్ని ప్రబోధించే విశ్వమతం. బౌద్ధాన్ని సరిగా అధ్యయనం చేయలేదనిపిస్తుంది. లోహియా కర్మయోగి కావడం వలన భారతీయ దర్శన గ్రంథాలను అంతగా పట్టించుకోలేదు. అవినీతి కుంభకోణాల మీద అవిశ్రాంత పోరాటం చేసేవాడు లోహియా. నీతి, అవినీతి సమాజంలో ఉంటాయి. అందరూ కరుణామయులూ సత్పురుషులూ అయితే అవనీతి, అన్యాయం, చట్టాలూ అక్కరలేదు. అవినీతి ప్రాచీన కాలం నుంచి సమాజంలో భాగంగానే ఉంది.

కౌటిల్యుడు అర్థశాస్త్రంలో నలభై రకాల అవినీతులను చెప్పాడు. ఆయనే రాజకీయాల్లో నైతిక భావాలకు స్థానం లేదన్నాడు. మోసం, అవినీతిని అంగీకరించాడు కొన్ని పరిస్థితులలో. నైతికతకంటే భౌతిక విలువలకు ప్రాధాన్యతనిచ్చాడు. పాలకుడు సద్గుణానికి కాదు ఐశ్వర్యానికి, ధనానికి విలువిస్తాడు.

అభివృద్ధి చెందుతున్న, మారుతున్న సమాజంలో అవినీతి అనివార్యం. సమాజంలో ప్రజలకు బాధకలిగించనంత వరకు పేచీ ఉండదు. ఆధునిక సమాజంలో ధనానికి ఉన్న విలువ దేనికీ లేదు. అవినీతి ఎక్కడ జరిగినా విరుచుకు పడేవాడు లోహియా. ఆయన ఒంటరి వాడు. ధనంతో ఆయనకు అవసరం లేదు అనుకొని ఉంటాడు. దళితుల ప్రయోజనాల కోసం ఎంతో కృషి చేశాడు. సమూల పరివర్తనకు సప్తవిప్లవాలను ప్రవచించాడు.

1. స్త్రీ పురుష సమానత్వం.
2. రంగు కారణంగా ఉన్న అసమానతల నిర్మూలన.
3. జన్మతః కులం ద్వారా ఏర్పడే అసమానతల వ్యతిరేకత.
4. సామ్రాజ్య వాదానికీ విదేశీ ఆక్రమణలకు వ్యతిరేకంగా వసుధైక ప్రభుత్వ స్థాపన.
5. వ్యక్తిగత ఆస్తులు, యాజమాన్యాల వలన ఏర్పడిన ఆర్థిక అసమానతల నిర్మూలనకు ప్రణాళికాబద్ధమైన ఉత్పత్తుల అభివృద్ధి.
6. వైయక్తిక అధికారాల మీద జరిగే దాడులను వ్యతిరేకించడం.
7. ఆయుధాలకు వ్యతిరేకం, శాసనోల్లంఘన సిద్ధాంతానికి అనుగుణం.

అట్టడుగు ప్రజల ప్రగతి కోసం గాంధీజీ ప్రతిపాదించిన సర్వోదయ సిద్ధాంతానికి, లోహియా ప్రతిపాదించిన సప్తవిప్లవాల సిద్ధాంతానికి, లోక్‌నాయక్ జయప్రకాష్ నారాయణ విప్లవాత్మకమైన మార్పుకోసం ప్రతిపాదించిన సంపూర్ణ విప్లవ సిద్ధాంతానికి మధ్య సారూప్యత ఉన్నట్లు గ్రహించవచ్చని మధులిమాయే అంటాడు.

ఆయన ప్రేరణవల్లనే లోకసభలో తెలుగు, తమిళం తదితర ప్రాంతీయ భాషలను అనుమతించమేగాక వాటి అనువాదానికి ఏర్పాట్లు చేశారు. అంగ్రేజి హటావో ఉద్యమం ద్వారా దేశంలోని అనేక మంది మేధావులను శాస్త్రజ్ఞులను, సాహితీ వేత్తలను, పత్రికా రచయితలను ఒక వేదిక మీదకు తీసుకువచ్చిన ఘనత లోహియాదే.

తెలుగు అకాడమీ వారు భాషా సమస్య పేరుతో సురమౌళి అనువాదంతో లోహియా గ్రంథాన్ని ప్రచురించారు. ఆంగ్లం, జర్మన్, ఫ్రెంచి భాషలలో నిష్ణాతుడు. హిందీ మాట్లాడేవాడు. బెంగాలీ, గుజరాతీ, మరాఠీలు కూడా తెలుసు. భారతీయ భాషల గురించి, హిందీ భాష అవశ్యకతను, ఆంగ్ల భాష వ్యతిరేకతను ఈ పుస్తకంలో పొందుపరచ బడింది. ఆయన అనేక ప్రదేశాల్లో చేసిన ప్రసంగాలు. భాషా శాస్త్రవిషయంగా Indian Alphabet రెండు వ్యాసాలు కనిపిస్తున్నాయి.

భౌతిక విజ్ఞాన శాస్త్రాలు అధి భౌతిక శాస్త్రం నుండి పుట్టాయి. ప్రకృతి విజ్ఞాన శాస్త్రాల నుండి అధి భౌతిక శాస్త్రం. లోహియా చరిత్ర చక్రంలో గణితశాస్త్రం విజ్ఞాన శాస్త్రాలకు మూలం. చరిత్ర కూడా సాంఘిక శాస్త్రాలకు మాతృక అన్నాడు. భారతదేశ చరిత్రను అధ్యయనం చేసి లోపాలను ఎత్తి చూపాడు. విన్‌సెంట్ స్మిత్, తారాచంద్, మజుందార్, ఆలీగడ్ పంథా, సావర్కార్, సుందరలాల్, బి. అగర్వాల్ వంటి ఉద్దండ చరిత్రకారుల రచనలు పరిశీలించి రాశాడు. పుస్తక సమీక్షలు చేశాడు.

కులనిర్మూలన కోసం ఎంతో కృషి చేశాడు. Caste System అనే గ్రంథంలో కులం మీద ఆయన చేసిన పోరాటం గుర్తించవచ్చు. అంబేద్కర్‌తో జరిపిన ఉత్తర ప్రత్యుత్తరాలు కూడా ఉన్నాయి. "కులం అవకాశాన్ని పరిమితం చేస్తుంది. పరిమితమైన అవకాశం సామర్థ్యాన్ని అణచివేస్తుంది. కులం ఎక్కడ తల ఎగరేస్తుందో అక్కడ అవకాశం సామర్థ్యం ప్రజల నిరంతర సంకుచిత పరిధుల్లో గిరికీలు కొట్టవలసిందే" అంటాడు. లోహియా చరిత్రకారుడు, ఆర్థికవేత్త, సమాజశాస్త్రజ్ఞుడు, తాత్వికుడు, బుద్ధ జీవి, హృదయ జీవి, సాహిత్యం, సంగీతం, చిత్రం, శిల్పం, నాట్యం మొదలైన వాటిని గురించిన పరిజ్ఞానం ఎంతో ఉంది. ఈ విషయాల మీద ఆయన రాసిన వ్యాసాలు చూస్తే లోహియా రాజకీయ నాయకుడనే విషయం మరచిపోతామంటాడు సంజీవదేవ్. లోహియా పగటివెలుగునూ, సంజవెలుగనూ, వెన్నెలనూ ఆనందిస్తాడు. సౌందర్యోపాసకుడుగానూ కనిపిస్తాడు. మన దేశ చరిత్ర మతం రాళ్ళలోనే చెక్కారంటాడు. భారతదేశంలోని యాత్రా స్థలాలన్నిటిని చూచాడు. కవి హృదయంతో రాసిన వర్ణనలున్నాయి.

రాముడు, శివుడు, కృష్ణుడు ఈ ముగ్గురిని గురించి తనదైన అవగాహనతో వివరించాడు. రాముడి మీద ఉన్న అభిమానంతో రామాయణ మేళా జరపాలని ఎన్నో కలలు కన్నాడు. కల చెదిరింది. భారతీయ సంస్కృతి సాహిత్యాలపట్ల అమితమైన అభిమానం, రాజకీయ నాయకుల్లో లేదు. లోహియాను, భారతదేశ సమైక్యతా సాధన కోసం ఆయన పడిన తపన అర్థం చేసుకున్నవారు తక్కువ. అపార్థం చేసుకున్న వారు ఎక్కువ.

దుందుడుకు మనస్తత్వం. స్థిమితత్వం తక్కువ. ఏ అన్యాయం జరిగినా విరుచుకుపడే గుణం. గాంధీ వారసుడుగా, మేధావిగా, సాహిత్యోపజీవిగా, సమాజవాదిగా భారతదేశానికి ఆయన ఇచ్చిన సంపద చిరస్మరణీయం. అజరామరం.

ఆయన కాలంలో తిరుగుబాటు దేశంలో బలహీనంగా ఉండే. ఈనాడు ప్రజల్లో ప్రతిఘటన బలంగా కనిపిస్తూ ఉంది. లోహియా ఆలోచనలు రాజకీయాల్లో ప్రజల్లో సాకారరూపం దాల్చడం మంచి పరిమాణం.

**ఉపయుక్త గ్రంథాలు :**

1. లోహియాదర్శనం - సురమౌళి,
2. అనవద్య అతీత అమేయవ్యక్తిత్వాలు - సురమౌళి,
3. Internal During Polities - *Dr. Lohia,*
4. The Caste System - *Lohia,*
5. ఇతిహాసచక్రం - అనువాదం తుమ్మల చౌదరి,
6. భాషా సమస్య - అనువాదం సురమౌళి.

# భిక్షువులు

హిందీమూలం : వాసుదేవశరణ్ అగ్రవాల్ తెలుగు - ఘట్టమరాజు

**భిక్షువులు :**

పాణినీయ సూత్రాల్లో భిక్షు (3-2-168), భిక్షాచర (3-2-17), భిక్షాక (3-2-115- వీధి బిచ్చగాడు) అనే పదాలు ఉల్లేఖింపబడ్డాయి. పాణినికి బ్రాహ్మణ మత భిక్షుకుల, నాస్తిక మత భిక్షుకుల పరిచయ ముండేది. ఆయన పారాశర్య, కర్మంద భిక్షు సూత్రాల్ని పేర్కొన్నాడు. వాళ్లు ప్రాచీన గురుకులాల్లో సంప్రదాయబద్ధంగా విద్యాధ్యయనం చేసేవాళ్లు. అలాగే ఆయన మస్కరీ పరివ్రాజకుల్ని కూడా పేర్కొన్నాడు. బహుశా ఆయన మక్ఖలి గోసాల సంప్రదాయాన్ని సూచింపదలచి వుంటాడు. 'అష్టాధ్యాయి'లో ఈ కింది పదాలు పేర్కొనబడ్డాయి- తాపస (5-2-103); తపస్వీ (5-2-102) ఈ రెండు పదాలు తపస్సు చేసే భిక్షువులకు వర్తిస్తాయి (తపస్యతి, 3-1-15). శమీ, దమీ, యోగీ, వివేకీ, త్యాగీ (3-2-142) - ఈ పదాలన్నీ ధార్మికసాధనను సూచిస్తాయి. శారీరకంగా, మానసికంగా సంయమనం పాటించేవాళ్లు దాంత, శాంతలుగా పిలువబడే వాళ్లు (7-2-27).

**భిక్షువుల వృత్తులు :**

అందరి ఇళ్లల్లోనూ బిచ్చమెత్తుకొనే బిచ్చగాడు 'సర్వాన్నీన భిక్షువు' (సర్వాన్నాని భక్షయతి, 5-2-9) అనబడే వాడు. అంటే కొందరు బిచ్చగాళ్లు కుల మతాల్ని పాటిస్తూ బిచ్చమెత్తుకొనే వాళ్లని ధ్వనిస్తుంది. కొంత మంది భిక్షువులు ఉంఛవృత్తిని పాటించేవాళ్లు (ఉన్ఛతి, 4-4-32). ఇలాంటి బిచ్చగాళ్లు ముందు జాగ్రత్తగా ధాన్యాన్ని సేకరించి భద్రపరుచుకొనేవాళ్లు. వసంతఋతువు లోనూ, శరత్ ఋతువు లోనూ వచ్చే రెండు పంటల కాలంలో మునులు ధాన్యాన్ని సేకరించి పదిల పరచుకొనే వాళ్లని మనువు అంటాడు (6-12). శరత్ అంటే 'కొత్త' అని పాణిని అభిప్రాయ పడ్డాడు (శారదోఽ నార్తవే, 6-2-9; శారద శబ్దోఽయం ప్రత్యగ్రవాచీ). మునులు, బిచ్చగాళ్లు శరత్ ఋతువు కాలంలో పాత ధాన్యానికి బదులుగా కొత్తధాన్యాన్ని సేకరించే వారన్నదే పాణిని ఇంగితార్థం. భిక్షువులు ఆశ్వయుజ మాసంలో కొత్త ధాన్యాన్ని, కొత్త బట్టల్ని సమకూర్చుకోవాలని మనువు సూచిస్తాడు (మనుస్మృతి 6-15). అన్న వస్త్రాల సంబంధంగా కొత్త దనాన్ని పాణిని అభిలషించడం 'శారద' పద ప్రయోగం ద్వారా సూచింపబడింది.

వానప్రస్థ ఆశ్రమాన్ని పాటించే భిక్షువు 'నైకటి'కుడిగా పేర్కొనబడ్డాడు. ఇతను జనపదానికో, గ్రామానికో దూరంగా కాక దగ్గరగా నివసించేవాడు (నికటే వసతి, 4-473). అంటే ఈ భిక్షుజాతి జనులు అరణ్యాల్లో నివసించేవాళ్లు కాదన్నమాట. కాని మునులు, ఋషులు తప్పనిసరిగా అరణ్యాల్లో నివసించేవాళ్లు. అరణ్య నివాసం ఋషుల, మునుల బహిరంగ లక్షణంగా ఉత్తరాధ్యయన సూత్రంలో పేర్కొనబడింది.[1] మహాభారతం కూడా దీన్నే సమర్థించింది.

---

1. న వి ముండి ఏణ సమణో ఓంకారేణ న బంభణో।
న మునీ రణ్ణవాసేణ కుస చీరేణ చతాపసో॥ (ఉత్తరాధ్యయన, 15-31)
మౌనాద్ధి సీ మునిర్భవతి నారణ్య వసనాన్మునిః (ఉద్యోగపర్వం, 43-35)

---

జి. అశ్వద్ధ నారాయణ, # 49, శ్రీగిరి, కాలేజీ టీచర్స్ లే అవుట్, బెంగుళూరు - 85

తలదించుకుని, నేలవైపే చూస్తూ నడిచే భిక్షువును కౌక్కుటికుడు అనేవారు. (సంజ్ఞాయాం లలాట కుక్కుట్యో పశ్యతి, **4-4-46;**

దేశస్వాల్పతయా హి భిక్షుర

విక్షిప్త దృష్టిః పాదవిక్షేప దేశే చక్షుః

సంయమ్య గచ్ఛతి స ఉచ్యతే కౌక్కుటికః,

ఆడ మగ కోళ్లు తమ దృష్టి సారించినంత దూరం - చాలా కొద్ది దూరం - మాత్రమే ఎగురగలుగుతాయి. ఆ అల్ప దూరం ఇక్కడ సూచింపబడింది. కాశికా.)

**కపట భిక్షువు :**

మోసకారి భిక్షువును దాండాజినికుడని పిలిచేవారు **(5-3-76).** ఇతను దండాన్ని, మృగ చర్మాన్ని ప్రజలకు చూపిస్తూ, బిచ్చమెత్తుకొని బతికే కపట సన్యాసి.

**ఆయఃశూలికులు :**

ఆయః శూలికులనబడే మరో రకం కపట భిక్షువులుండేవారు (ఆయః శూల దండా జినాభ్యాం ఠక్ ఠఞౌ, **5-2-76**). వీళ్లు ఇనుప శూలాన్ని ఉపయోగిస్తూ, ప్రజల్ని మోసగిస్తూ పొట్టపోసుకొనేవాళ్లు. పతంజలి దీన్ని ఇలా వ్యాఖ్యానించాడు— ఆయఃశూల మంటే ఇనుప శూలమనే అర్థంలో తీసుకోవాలి. శివ భాగవత భిక్షువులు ఇనుప త్రిశూలాన్ని ధరించేవాళ్లు. ఆయః శూలికులు అనేమాట శివ భాగవత భక్తులకు వర్తిస్తుంది అని పతంజలి అభిప్రాయపడ్డాడు. కాని పాణిని దీన్ని మరోలా వ్యాఖ్యానించాడు. ఇనుప శూలం లేదా త్రిశూలంతో తమ దేహంలోని వివిధ భాగాలపై నెత్తురు చిమ్మేలా పొడుచుకొంటూ, ప్రేక్షకుల్ని ప్రభావితుల్ని చేస్తూ పబ్బం గడుపుకొనే కపట భిక్షువులుగా ఇలాంటి వారిని పేర్కొన్నాడు పాణిని. క్రూరమైన ఉపాయాలతో ప్రజల్ని మోసగించి పొట్టపోసుకొనే భిక్షువుల్ని 'ఆయఃశూలికులు'గా పాణిని వ్యవహరించాడు.

**మస్కరీ :**

పాణిని 'మస్కరీ' పదాన్ని పరివ్రాజకుడనే అర్థంలో ప్రయోగించాడు (మస్కర మస్కరిణౌ వేణు పరివ్రాజకయోః— **6-1-154**). ఆజీవక సంప్రదాయాన్ని స్థాపించిన మక్ఖలి గోసాలున్ని ఉద్దేశించి పాణిని 'మస్కరీ' పదాన్ని వాడాడు. మస్కరీ అంటే వెదురు కర్రను చేత్తో పట్టుకొని నడిచే సాధువును 'మస్కరీ' అని అనరని పతంజలి స్పష్టంగా చెప్పాడు. మరి ఆయన 'మస్కరీ' పదాన్ని ఏ అర్థంలో వాడాడు? కర్మ మార్గాన్ని కాక శాంతి పథమే శ్రేయస్కరమని భావించే సాధువు 'మస్కరీ' అని ఆయన భావించాడు (న వై మస్కరోఽ స్యాస్తీతి మస్కరీ పరివ్రాజకః. కిం తర్హి మాకృత కర్మాణి మాకృత కర్మాణి శాంతిర్వః శ్రేయసీత్యాహాతో మస్కరీ పరివ్రాజకః, భాష్యం **6-1-154**). పతంజలి ఇక్కడ నిక్కచ్చిగా మక్ఖలి గోసాలుని కర్మాపవాద సిద్ధాంతాన్నే పేర్కొన్నాడు. ఆజీవక సాధువులు కర్మ మార్గాన్ని నిరసించి, నియతి లేదా విధినే సర్వస్వంగా భావించారు. మన కృషి , సామర్థ్యం వల్ల ఏదీ సిద్ధించదనీ, అంతా విధివిలాసమే అని వాళ్ల నమ్మకం. దైవలీల ముందు పురుషార్థం (కర్మ) దేనికీ పనికిరాదని వాళ్లు నమ్మారు. మక్ఖలి దర్శనం మన కోరికల ప్రమేయం ఏదీ వుండదనీ,

క్రూర విధి అంతా మొదటే నిర్ణయించి వుంటుందనీ విశ్వసిస్తుంది; చెప్తుంది. బుద్ధుడు మక్ఖలి గోసాలుడు ఆచార్యులందరిలోకీ ప్రమాదకరమైన వ్యక్తిగా భావించాడని బౌద్ధ గ్రంథాలు చెప్తున్నాయి.

పాణినికి ఆజీవక సంప్రదాయంతో పరిచయం వుండేదని ఇతర ప్రమాణాల ద్వారా తెలుస్తూంది. 'అస్తి నాస్తి దిష్టం మతిః' (4-4-60) అనే సూత్రంలో ఆస్తిక, నాస్తిక, దైహిక అనే మూడు రకాల దార్శనికులు పేర్కొనబడ్డారు. ఈ ప్రపంచం భగవంతుని సృష్టి అని నమ్మేవాళ్లు ఆస్తికులు. బౌద్ధ గ్రంథాల్లో వీళ్లు ఇస్సర కరణ వాదులుగా పేర్కొనబడ్డారు. (అయం లోకో ఇస్సర నిమిత్తో) పాళీ గ్రంథాల్లోని నత్థిక దిట్ఠి దార్శనికులు పాణిని దృష్టిలో నాస్తికులు. వీళ్లలో కేసకంబళీ నత్థిక దిట్ఠి అనుయాయులు ముఖ్యులు. (ఇతో పరలోక గతం నామ నత్థి అయం లోకో ఉచ్ఛిజ్జతి, జాతక కథలు, 5-239) ఇది లోకాయత దృక్పథం. కఠోపనిషత్తులో ఇది - 'ఆయం లోకో న పరః ఇతి మానీ' అని పేర్కొనబడింది. పాణిని పేర్కొన్న మూడవరకం దార్శనికులు దైష్టికులు లేదా మక్ఖలి ఆజీవక సంప్రదాయానికి చెందిన నియతి లేదా భాగ్యవాదులు. వీళ్లు పురుషార్థమైన కర్మను ఖండిస్తూ, విధి విలాసాన్నే గాఢంగా నమ్ముతారు.

జైన ఆగమాల్లో మక్ఖలి గోసాలుడు - గోసాల మంఖలి పుత్తగా వ్యవహరింప బడ్డాడు (ఉవా సగదసాఓ). సంస్కృతంలో అతనే మస్కరీ గోశాలిపుత్రగా పిలువబడ్డాడు (దివ్యావధాన, పే.143). మస్కరీ, లేదా మక్ఖలి లేదా మంఖలి దర్శనం సువిదితం. మహా భారతంలోని మంకి ఋషి కథలో నియతి వాదం ప్రతిపాదించబడింది (శుద్ధం హి దైవమే వేదం హఠే నైవాస్తి పౌరుషమ్, శాంతిపర్వం 177/11-4). మంకి ఋషి మూల దృక్పథం నిర్వేదం లేదా పతంజలి పేర్కొన్నట్లుగా శాంతి పరమైన దృక్పథం. అంటే కాళ్లు చేతులు ఆడించకుండా - కష్టపడకుండా జీవితం సాగించుట. ఇది పాణి వాదానికి సంపూర్ణంగా వ్యతిరేకమైనది. మంఖలి గోసాలుని అసలు పేరు గురించి ఎన్నో అనుశ్రుతులున్నాయి. జైన ప్రాకృతంలో ఇతను మంఖలిగా పేర్కొనబడ్డాడు. భగవతీ సూత్ర ప్రకారం ఇతను గోశాల మంఖ అనే పేరుగల భిక్షుకుని కొడుకు (భగవతీ సూత్ర, 15/1).

మహా భారతంలోని శాంతి పర్వంలో పేర్కొనబడ్డ మంకి ఋషి మంఖలికి మరో పేరు మాత్రమే. మక్ఖలి గోశాల లేదా ఆవుల కొట్టంలో పుట్టాడు కాబట్టి మంఖలి గోసాలగా పేరు మోశాడు. గోశాలలో పుట్టిన వ్యక్తిని గోసాలుడిగా పాణిని కూడా చెప్పాడు (గోశాలాయాం జాతః గోశాలః, 4-3-35, స్థానాంత గోశాల-ఖరశాలాచ్చ).

**శ్రమణుడు :**

అష్టాధ్యాయిలో శ్రమణుల గురించి, పెళ్లి కాని స్త్రీ శ్రమణుల గురించి ఉల్లేఖింపబడింది. అవివాహితలైన స్త్రీ శ్రమణులు - కుమార శ్రమణా లేదా కుమారీ శ్రమణా అని పిలువబడ్డారు (కుమార శ్రమణాధిభిః, 21/70), కుమారశ్చ సూత్ర (6-2-26). కుమార శ్రమణా అనే పదాన్ని పాణిని ఆద్యుదాత్త అన్నాడు. శ్రమణాది గణాల్లో కుమార ప్రవ్రజితా, కుమార తాపసీల పాఠాలున్నాయి. శ్రౌత సూత్రాల్లో శ్రమణుడనే పదం భిక్షువులకు మాత్రమే అన్వయింపబడింది. బౌధాయనుడు మునిని శ్రమణుడనే పేరుతో పిలిచాడు. అంతే కాదు, మునులు సరస్వతీ నదిలో మోకాళ్ల లోతు నీటిలో నిలబడి అగ్నికి పురోడాశను అర్పించాలని అన్నాడు (బౌధాయన శ్రౌత్రాలు,

16-30, పే. 276). పతంజలి దృష్టిలో శ్రమణుడంటే బ్రాహ్మణుడు కానివాడు. ఈ ఇద్దరికీ బద్ధవైరముండేదని అతడు పేర్కొన్నాడు (యేషాం చ విరోధః శాశ్వతికః ఇత్యస్యావకాశః శ్రమణ బ్రాహ్మణమ్, భాష్యం 2-4-9).

బౌద్ధ సాహిత్యంలో కూడా శ్రమణ శబ్దం ఇదే అర్థంలో వాడబడింది. జాతక కథల్లో బోధిసత్వ గౌతముడు 'సమణు'డిగా పేర్కొనబడ్డాడు (జాతక కథలు, 3-40). ఆ కాలంలో శ్రమణుల్లో, బ్రాహ్మణుల్లో ఎన్నో సంప్రదాయాలుండేవని ఉదానంలో చెప్పబడింది. అందరూ పరివ్రాజక జీవితాన్నే గడుపుతూ ఉండేవాళ్లు. వాళ్లు నానా రకాలైన దిట్ఠి లేదా దార్శనిక మతాలు అనుసరించే వాళ్లు. వాళ్ల మధ్య అభిప్రాయ భేదాలు కూడా ఉండేవి (సంబహులా నానాతి త్థియా సమణ బ్రాహ్మణ పరిబ్బాజకా నానా దిట్ఠికా నానా నిస్సయ నిస్సతా, పాలీ ప్రతి, పే. 66-67). అంగుత్తర నికాయంలో రెండురకాల పరివ్రాజకులు పేర్కొనబడ్డారు— బ్రాహ్మణ పరివ్రాజకులు, అన్యతి త్థియ పరివ్రాజకులు అంటే బ్రాహ్మణ మతానికి భిన్నమైన తీర్థికు (ఆచార్యుల)ల అనుయాయులు. అశోక చక్రవర్తి కూడా శ్రమణుల్ని బ్రాహ్మణుల కంటే భిన్నమైన వాళ్లుగా చెప్పాడు.

### చీవరము :

భిక్షుని వేషాన్ని లేదా వస్త్రాల్ని చీవర మనేవాళ్లు. చీవరాన్ని ధరించే వాళ్లకై సంస్కృతంలో ఒక కొత్త ధాతువే ఏర్పడింది - సం చీవ రయతే = అతడు చీవరాన్ని ధరిస్తాడు అంటే భిక్షువుగా మారాడు అని అర్థం (3-1-20). బౌద్ధ సాహిత్యంలో 'చీవర' పదం భిక్షువులకు మాత్రమే వర్తించేది. ఉదా :- తిచీవర (జాతక కథలు, 3/471), పంసుకూల చీవర (జాతక కథలు 4/114), ఈ పదాలు భిక్షువుల వస్త్రధారణకు సంబంధించినవి.

### అర్హత్ :

ప్రశంసనీయమైన పురుషునికి ఈ పదం వర్తిస్తుంది (అర్హః ప్రశంసాయామ్, 3-2-133, అర్హన్నిహ భవాన్పూజామ్); అర్హతుని (అర్హుని) స్థితిని అర్హంత్య అనే వాళ్లు (అర్హతో నుమ్ చ, గణ సూత్రాలు, 5-1-24).

### యాయావర :

3-2-176 సూత్రం (యశ్చ యఙః)లో యాయావర శబ్దం నిరూపించబడింది. ఉత్తమమైన విధంగా జీవితం గడిపే భిక్షువుల్ని యాయావరులుగా పిలిచే వాళ్ళని బౌధాయన ధర్మ సూత్రాలు చెప్తాయి. వీళ్లు శాల (కొట్టాల్లో)ల్లో (3-1-3) లేదా ఇళ్ళల్లో నివసించేవారు (వృత్త్యా వరయా యాతి 3-1-4-). యాయావరులు యాత్రలు చేస్తున్నప్పుడు మధ్య మధ్యలో ఆగుతూ అగ్నిహోత్రాలు చేసేవాళ్లు (తత్రోదా హరన్తి యాయావరా హ వై నామర్షయ ఆసంస్తేఽ ధ్వన్యశ్రామ్యంస్తే సమస్త మజుహవుః, బౌధాయన ధర్మ శ్రౌతలు 24-31) వాళ్లు తమను తాము తపస్వులుగా, ఋషులుగా భావించేవాళ్లు (యాయావరా నామ వయ మృషయః సంశిత వ్రతాః, ఆదిపర్వం, 41-16). బహుశా భార్యతోపాటు వాన ప్రస్థాశ్రమంలో కాలం గడిపే వైఖానస భిక్షువులు వీళ్లే కాబోలు. వీళ్లు బళ్ల మీద సామానులు సాగిస్తూ తిరిగే వారు. సయుగ్వా రైక్వుని ఇందుకు ఉదాహరణగా చెప్పుకోవచ్చు.

# వికిరణాలతో ఎదురయ్యే సమస్యలు

- సి.వి. సర్వేశ్వర శర్మ

శక్తి ఒక ప్రదేశం నుండి మరొక ప్రదేశానికి ఏవిధమైన యానకము అవసరం లేకుండా ప్రయాణం చేసే భౌతిక దృగ్విషయానికి పేరు వికిరణము. శక్తి శూన్యం గుండా ప్రయాణం చేసే పద్ధతిని వికిరణం అంటారు.

అనుదినం మనం సహజ జనకాలు, కృత్రిమ జనకాలు విడుదల చేస్తున్న వికిరణాల నడుమ జీవిస్తున్నాము. ఈ వికిరణాలలో ముఖ్యంగా చెప్పుకోదగినవి ఎక్సు కిరణాలు, గామాకిరణాలు, ఆల్ఫా, బీటా కిరణాలు, న్యూట్రానులు.

ఈ వికిరణాలన్నీ అయనీకరణ వికిరణాలు. అంటే ఈ వికిరణాలు పదార్థం గుండా ప్రయాణించినపుడు అవి ఆ పదార్థంలో ఉండే తటస్థ పరమాణువులను విద్యుదావేశిత అయానులుగా మారుస్తాయి.

సహజ కిరణాలు మనమీద అనేక రకాలుగా వచ్చిపడుతున్నాయి. బాహ్యారోదసి నుండి వచ్చే కాస్మిక్ కిరణాలు, మనం నివసించే భూమిలో నిబిడీకృతమైయున్న రేడియో ధార్మిక కిరణాలు విడుదల చేసే వికిరణాలు ఈ తరగతికి చెందినవి. ఈ రకమైన వికిరణాలు మన శరీరం మీద పడడం వల్ల ఆరోగ్యానికి హానికల్గుతుంది.

**జీవవ్యవస్థలపై ప్రభావం :** జీవవ్యవస్థలపై ఈ వికిరణాలు రెండు రకాలుగా ప్రభావితం చూపుతాయి. వికిరణ తీవ్రత ఎక్కువగా ఉంటే కణం చనిపోవడం లేదా దానికి ఎక్కువ హాని జరుగుతుంది. వికిరణ తీవ్రత తక్కువగా వున్నప్పుడు జన్యు పదార్థాలలో ఉత్పరివర్తనాలు లేదా క్యాన్సర్ పుట్టుక ఉంటుంది.

వికిరణాలకు గురయిన కొన్ని నెలల లేదా సంవత్సరాల తరువాత గాని ఈ దుష్ఫలితాలు బయటపడవు. వికిరణ ప్రభావం గురించి చెప్పేందుకు దాని మోతాదు ఆధారంగా చెప్పలేము.

వివిధ రకాల కణాలు, కణజలాలు వికిరణ ప్రభావానికి చూపే ప్రతిస్పందనలో తేడా ఉంటుంది. ఎదిగిన జంతువుల మూలుగు కణాల్లో లేదా పిండంలో ఉండే అనేక అవయవ కణాల్లో ప్రచుర జననం జరుగుతుంది. ఇట్టి విభజన చెందే కణాలు ఎల్లప్పుడు వికిరణాల ప్రభావానికి గురిఅయ్యే అవకాశం ఎక్కువగా ఉంటుంది.

**వికిరణం సోకితే ఏమి జరుగుతుంది?** వికిరణం కణాలపై పడినపుడు దాని అంతర్ నిర్మాణంపై అనేక విధాలుగా ప్రభావం చూపుతుంది. కణ విభజనలో ఆలశ్యం జరగడం, డియన్‌లు సంశ్లేషణ అణచివేయడం, కణకవచంలో నష్టం ఏర్పడడం వంటివి జరుగుతాయి.

మనం భుజించే ఆహారంలో ఉండే రేడియో ధార్మిక పదార్థాల వల్ల మనకు సంభవించే విపత్తులను అంతర్ విపత్తులు అంటారు. ఎక్స్‌కిరణాలు, గామాకిరణాలు మంచి చోదక శక్తి గల వికిరణాలు వీటివల్ల మనిషికి జరిగే విపత్తును బాహ్యావిపత్తు అంటారు. ఇవి శరీరంపై ఒక స్థాయిని మించి పతనం చెందితే మనిషి ఆరోగ్యం ప్రమాదంలో పడుతుంది. న్యూట్రానులు కూడా ఈ కోవకు చెందినవే.

---

సి.వి. సర్వేశ్వరశర్మ, ప్రెసిడెంట్, కోనసీమ సైన్సు పరిషత్, కృష్ణమూర్తి వీధి, అమలాపురం.

పతనం చెందే న్యూట్రానుల శక్తిని బట్టి అవి కల్గించే ఆపద ఆధారపడి ఉంటుంది. హెచ్చుశక్తి గల న్యూట్రానులు ఎక్కువ ఆపదను కల్గిస్తాయి. న్యూట్రానులు శరీరంలోని జీవకణంతో చర్యకుదిగి మళ్ళీ న్యూట్రానులను ఉత్పత్తి చేస్తాయి.

బాహ్య విపత్తుల వల్ల వచ్చే ఆపదల తీవ్రతలను ఏరియా మానిటరింగ్, పర్సనల్ మానిటరింగ్ వంటి పరికరాలతో సులువుగా అంచనావేయవచ్చు.

**మరణం ఎలా సంభవిస్తుంది? :** మనిషి మొత్తం శరీరం గామాకిరణాలకు అందుబాటులో ఉంటే కేవలం ఆరువందల రేడ్‌ల వికిరణం అతని శరీరంపై పదిహేను రోజులు పడితే అతడు మరణిస్తాడు. నిజానికి ఇది స్వల్పమైన వికిరణ తీవ్రత. ఈ వికిరణ తీవ్రతకు మనిషి శరీర ఉష్ణోగ్రత పెరుగుతుంది. మరి అటువంటప్పుడు మనిషికి మరణం ఎలా సంభవిస్తుంది? అనేది ప్రశ్న.

ఈ విపరీతానికి జవాబుకోసం శాస్త్రవేత్తలు అన్వేషణలు చేస్తున్నారు. ఇప్పటికీ లభించిన ఆధారాలను బట్టి కొంత వివరణ ఇవ్వగల్గుతున్నారు. ఈ విపత్తుకు కారణం వికిరణాలు శరీరంలోని ఎంజైములతో జరిపేచర్య అని చెబుతున్నారు.

వికిరణాలకు శక్తిహెచ్చుగా ఉంటుంది. వీటి శక్తి మిలియన్ ఎలక్ట్రాన్ వోల్టులకు మించి ఉంటుంది. అందువల్ల ఇవి పదార్థం గుండా ప్రయాణం చేసినపుడు పదార్థాన్ని అయనీకరణం చెందిస్తాయి.

**అసలు విషయం :** ఎంజైమ్‌లు అంటే ప్రొటీనులు. ఇవి ఆహార జీర్ణప్రక్రియలో జరిగే సంశ్లిష్ట రసాయనిక మార్పులు జరిగేటట్లు చేస్తాయి. వీటిలో ప్రాథమిక బంధాలు ఉంటాయి. ఈ బంధాలవల్ల అనుఘటక మూలకాలయిన కార్బన్, నైట్రోజన్, ఆక్సిజన్, హైడ్రోజన్, సల్ఫర్ వంటి మూలకాలు పట్టి ఉంచబడతాయి.

వీటిలో గౌణ హైడ్రోజన్ బంధాలు కూడా ఉంటాయి. ఈ బంధాలు బలహీనంగా ఉంటాయి. వికిరణం శరీరం మీద పడినపుడు అది ఈ బలహీన బంధాలను నాశనం చేస్తుంది. ఈ నాశన ప్రక్రియ ప్రత్యక్షంగా గాని అప్రత్యక్షంగా గాని జరుగుతుంది.

మనిషి జీవితకాలం అతని శరీరంలో నాశనం కాబడ్డ ఎంజైముల శాతం మీద ఆధారపడి ఉంటుంది. నిత్యం మనం చేసుకునే పనులకు కావలసిన శక్తి, శరీరంలో జరిగే అనేక రసాయనిక చర్యల ఫలితంగా సమకూరుతుంది.

ఈ రసాయన చర్యల నిర్వహణ ఎంజైముల అదుపులో ఉంటుంది. మన శరీరంలో అనునిత్యం ఎన్నెన్నో కణాలు మరణిస్తూ ఉంటాయి. కొత్త కణాలు ఎన్నో పుడుతూ ఉంటాయి.

రక్తంలో కనిపించే ఎర్రకణం సగటు జీవితకాలం నాలుగు నెలలు. కొత్తకణాలు పుట్టడం శరీరపోషణపై ఆధారపడి ఉంటుంది. పరోక్షంగా శరీర పోషణం శరీరంలో ఉండే ఎంజైముల మీద ఆధారపడి ఉంటుంది.

**గతితప్పే పోషణ :** కణాలతో ఎంజైములు తయారవుతాయి. ఈ కణాలు కొంతకాలం చురుగ్గా ఉండి తరువాత మందకొడిగా తయారవుతాయి. చివరకు శరీరం నుండి తొలగింపబడతాయి. కొత్త ఎంజైములు తయారవుతూ ఉంటాయి.

కొత్త ఎంజైము ఏర్పడే విధానం శరీరంలో ఉండే ఇతర ఎంజైముల శాతం మీద ఆధారపడి ఉంటుంది. ఒకసారి శరీరంలో మూలాధారమయిన ఈ అణువులు నాశనం అయ్యేసరికి శరీర పోషణ గతి తప్పుతుంది.

మనిషికన్నా పిల్లి, ఎలుక వంటి జంతువులు వికిరణానికి ఎక్కువ నిరోధక శక్తి కల్గి ఉంటాయి. వికిరణాలు శరీరంలోకి ప్రసరించడం వల్ల రక్తంలోని తెల్ల కణాల సంఖ్య తగ్గిపోతుంది.

వికిరణ ప్రసారం వల్ల మనిషికి క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉంది. తమాషా ఏమిటంటే క్యాన్సర్ రోగులకు చికిత్సకోసం ఈ వికిరణాన్నే వినియోగిస్తారు.

శరీరం మీద ఎక్కువగా ఎక్సుకిరణాలు పడితే శరీరం కాలుతుంది. బోన్ నెకోసిన్, ఆల్టియోమైలిటీస్ వంటి రోగాలు వస్తాయి. వికిరణంవల్ల జీవన వ్యవస్థలో ఏదోరకమైన ఆపద సంభవిస్తుంది. ప్రతి తరగతికి చెందిన వికిరణం, ఏదో కోణం నుండి ప్రమాదం తెచ్చిపెడుతుంది. ఎందుచేతనంటే వికిరణం జెనిటిక్ ఫలితాలను ప్రేరేపించ గల్గుతుంది.

వైద్యపరంగా ప్రసారం చేసే ఎక్స్ కిరణాలు, రేడియంతో కలిపి పూతపూసిన రేడియండయల్సు గల వాచీలు, కేంద్రకరియాక్టర్లు సమీపంలో నివశించడం వల్ల మనిషిమీద పడే వికిరణాలవల్ల ప్రమాదం ఉండదని, ఆరోగ్యానికి అవి హానికరం కాదని అంటున్నారు.

**వికిరణం ఒక కొత్తపరికరం:** వికిరణం ఇప్పుడు శాస్త్రవేత్తల చేతిలో ఒకకొత్త పరికరం. ఈ వికిరణం మనిషి నిత్యజీవితంలో ఎనలేని సేవలు అందిస్తోంది. భౌతికశాస్త్రం పెక్కు విభాగాల్లోనూ, జీవరసాయన శాస్త్రాల్లోను, జీవశాస్త్రంలోను రేడియో ఐసోటోపులను ఉపయోగించి వికిరణాన్ని వాడుకుంటున్నారు.

వ్యవసాయం, ఉద్యానవన కృషిలయందు నూతనమయిన పంటలను, ఫలపుష్పాలను తయారు చేయడానికి వికిరణాన్ని ఉపయోగించుకుంటున్నారు. రేడియోధార్మిక పదార్థాల ఉపయోగం రోజురోజుకి పెరిగిపోతుంది. అన్నిరకాల విజ్ఞాన శాస్త్రవిభాగాల్లో వీటి ప్రాముఖ్యత బాగా పెరిగింది.

మనకు ఇష్టంవున్నా లేకపోయినా ఈ వికిరణాల గురించి తప్పనిసరిగా మనం తెలుసుకోవాల్సి ఉంది. అంతే కాదు వీటితో క్షేమదాయకంగా సహజీవనం ఎలా చేయాలో తెలుసుకోవాల్సి ఉంది.

వికిరణాల గురించి మనుషుల్లో ఎన్నోరకాల భయాలువున్నాయి. ఈ శక్తిని వినియోగించుకునే ముందు మనం జాగ్రత్తగా ఉండాలి. కాని భయపడాల్సిన అవసరం లేదు.

**వికిరణాలతో వ్యవసాయం:** ప్రకృతి సహజంగా వచ్చే మార్పు కృత్రిమంగా తొందరగా ఏర్పరచగల పద్ధతిని ఎక్స్‌కిరణాల సహాయంతో సాధించగలిగారు. బార్లీ విత్తనాలపై ఎక్స్‌కిరణాలను పంపి ఆ విత్తనాలలో మార్పు తీసుకురాగలిగారు.

రేడియో ధార్మిక కిరణాలను నిర్విరామంగా వృక్షాలపై ప్రసరింపజేసి వాటి పెరుగుదల మరియు ఫలసాయంలో గణనీయమైన మార్పును శాస్త్రవేత్తలు సాధించగలిగారు.

రేడియం, యురేనియం వంటి రేడియో ధార్మిక మూలకాలు చాలా ఖరీదయినవి కావడంవల్ల, ఇవి స్వల్పంగానే ఉండడంవల్ల శాస్త్రవేత్తలు వీటితో ప్రయోగాలు చేయడానికి ఇబ్బందులు ఎదుర్కొన వలసి వచ్చింది.

దీనికి ప్రత్యామ్నాయంగా తక్కువ ఖర్చుతో లభ్యమయ్యే రేడియో ఐసోటోపులను వినియోగించి, రేడియో ధార్మిక కిరణాలను ఏర్పరుచుకుని వాటితో ప్రయోగాలు చేశారు.

రేడియో ఐసోటోపులు తయారు చేసేందుకు సామాన్య పరమాణువును ఎటామిక్ పైల్ నందు గాని, న్యూక్లియర్ రియాక్టరు నందుగాని ఉంచి రేడియో ఐసోటోపుగా మార్చవచ్చును.

కోబాల్టు మూలకాన్ని ఎటామిక్ పైల్‌లో ఉంచిన అది న్యూట్రానులను గ్రహించి రేడియోధార్మిక ధర్మాన్ని పొందుతుంది. అనగా పరమాణు సంఖ్య 60గల రేడియో కోబాల్టు తయారవుతుంది. ఇది ఐసోటోపు.

**కృత్రిమ ఐసోటోపు :** కృత్రిమంగా తయారయిన ఈ ఐసోటోపు ఎక్సుకిరణాలకన్నా శక్తివంతమైన గామాకిరణాలను విడుదల చేస్తుంది. ఈ వికిరణాలను వెలువరిచే శక్తి అయిదు సంవత్సరాల నాలుగు నెలలకు సగానికి తగ్గుతుంది. అంటే ఈ కాలం దాని అర్ధాయుష్షు అవుతుంది. ఇది నిరంతరంగా గామాకిరణాలను విడుదల చేస్తుంది. దీని ఖర్చుచాలా తక్కువగా ఉంటుంది. అంటే సహజ రేడియో ధార్మిక పదార్థానికి అయ్యే ఖర్చుకాదు. వేసవిలో దీనిశక్తి అయిదు శాతం కోల్పోతుంది.

**రేడియోవ్యవసాయం :** ఆరు ఎకరాల మాగాణీ కేంద్రస్థానంలో ఈ కోబాల్టు 60ని గామాకిరణాల జనకంగా ఏర్పాటు చేశారు. దీనిచుట్టూ ఏకకేంద్ర వృత్తపరిధులలో మొక్కలను పెంచారు. ఈ గామాకిరణ జనకాన్ని ఒక పెద్ద ఉక్కుగొట్టంలో రెండుటన్నుల సీసపుస్థూపంలో అమర్చారు.

వికిరణ జనకాన్ని ఉక్కుగొట్టంపైకి : లోపలకు కావలసిన విధంగా అమర్చుటకు కప్పీత్రాడును ఏర్పరచారు. ఉక్కుగొట్టం స్థూపం నుండి భూగర్భం గుండా 450 అడుగుల దూరము గొట్టముల గుండా త్రాడును నడిపి అచట లాగుటకు, వదులుటకు ఏర్పాటు చేశారు.

వ్యవసాయ కూలీలుగాని, రైతులు గాని పొలంలో పనిచేయునపుడు వారికి గామకిరణాలు హానిచేయకుండా సీసపు దిమ్మెను ఉక్కుగొట్టములోకి 450 అడుగుల దూరం నుండి దింపేస్తారు.

ఈ రేడియో ధార్మిక జనకము చాలా ప్రమాదకరమైనది. దీనిని ఎంతో జాగ్రత్తగా వాడాలి. సాయంత్రం పొలంలో పనిపూర్తి అయిన తరువాత ఈ జనకాన్ని పైకి లేపి వెళ్లిపోతారు. వికిరణ ప్రసార సమయంలో పొలంలో కొద్ది గంటలు ఎవరైనా ఉంటే వారు చనిపోతారు. ఈ గామకిరణాలు మొక్కల అంతర్భాగాలలోకి చొచ్చుకుపోయి వాటి పెరుగుదలకు, ఫలోత్పత్తికి ఎక్కువగా తోడ్పడతాయి.

పొలంలో ఎలుకలు ప్రవేశిస్తే అవి ఈ వికిరణాల ధాటికి చచ్చిపోతాయి. అంతేకాదు మొక్కలకు సంక్రమించే పురుగు తెగుళ్లను ఈ వికిరణాలు మట్టుబెడతాయి. ధాన్యమునకు ఈ వికిరణాల పట్ల ఎక్కువ నిరోధక శక్తి ఉంటుంది.

ఈ రకమైన రేడియో వ్యవసాయంవల్ల పొలంలో పండే పంట దిగుబడి బాగా పెరగడమేగాక ధాన్యం నాణ్యత బాగుంటుంది. పంటకు శత్రువుల నుండి విశేషమైన రక్షణ ఉంటుంది. ఇంకా ఇది ప్రయోగ దశలో ఉంది. పంట పండే కాలవ్యవధి కూడా తగ్గడం ఇందులోని మరొక విశేషం.

# కోటి లింగాల వివరాలు - పరిరక్షణ

- డా॥ మలయశ్రీ

తెలంగాణా - కరీంనగర్ జిల్లా గోదావరి తీరంలోని చారిత్రక గ్రామం కోటిలింగాల. కరీంనగర్ నుండి లక్షెట్టిపేట (70 కి.మీ.) రహదారిలో వెల్గటూరు-రాయపట్టణం మధ్య రోడ్డుకు తూర్పువైపు 5 కి.మీ. దూరంలో ఉంది కోటిలింగాల. కరీంనగర్ నుంచి 50 కి.మీ. ఇప్పుడది గోదావరి దక్షిణ తీరంలోని చిన్న గ్రామం. కాని, ఒకప్పుడు క్రీ.పూ. 4, 5 శతాబ్దుల్లో అది ఒక పెద్ద పట్టణం. తొలి శాతవాహనులకు (క్రీ.పూ. 3వ శతాబ్ది) వారికి, మొదటి ఆంధ్ర రాజులకు (క్రీ.పూ. 4 శ) ఇది రాజధాని నగరం అని ఇక్కడ లభించిన ప్రాచీన నాణాల వలన తెలిసింది. 1978 వరకు ఈ చారిత్రక స్థల ప్రాధాన్యత ఎవ్వరికీ తెలియదు. పోస్టల్ ఉద్యోగి సంగనభట్ల నరహరికి (ధర్మపురి) కప్పరావుపేటలో ప్రాచీన నాణాలు లభించి ఆయన దృష్టి కోటిలింగాలవైపు మళ్ళింది. టి. రాజారాం సింగ్ (పెద్దపల్లి) కూడ కోటిలింగాలపై పరిశోధన చేసిన్రు. అప్పుడు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పురావస్తు శాఖవారు ఇక్కడ 1980-84 తవ్వకాలు జరిపితే, దీని ప్రాధాన్యత వెలుగు చూసింది. ఈ కృషి ముఖ్యంగా డా॥ వి.వి. కృష్ణశాస్త్రి, పి.వి. పరబ్రహ్మశాస్త్రి గారలది.

కరీంనగర్ జిల్లాలో గోదావరి పడమర (ధర్మపురి) నుంచి, తూర్పునకు (మంథని-కాళేశ్వరం) ప్రవహిస్తున్నది. కోటిలింగాల వద్ద దక్షిణం నుంచి పెద్దవాగు మునేరు వచ్చి గోదావరిలో కలుస్తున్నది. ఈ రెండు నదులు కలిసే చోట ఏర్పడిన త్రిభుజాకార స్థలంలో పెద్ద ఇటుక కోట నిర్మించబడింది. దాని గోడలు బలమైనవి. 140 ఎకరాల విస్తీర్ణం. కాల్చిన పెద్ద ఎర్రని ఇటుకలతో కట్టిన ఈ కోటకు నాలుగు వైపుల బురుజులున్నవి. దక్షిణంగా మునేరు ప్రక్కన కోట గోడ భాగం దిబ్బగా మిగిలి ఉంది. తూర్పువైపు ఆగ్నేయం బురుజు మీద నిర్మించబడిన కోటేశ్వరస్వామి దేవాలయం ఇప్పుడు పూజలందుకుంటున్నది. ఉత్తరదిశ గోదావరి వైపు కోటగోడ చిహ్నాలు లేవు. నది వరదల ప్రభావం కావచ్చు. వింతేమిటంటే ఇప్పుడు కోటిలింగాల గ్రామంలోని ఇండ్ల గోడలు, ఇళ్ళ, పెరళ్ళ ప్రహరి గోడలు సగానికెక్కువ నాటి కోట గోడల పెద్ద ఇటుకలతో కట్టబడినవే.

ఇక్కడి త్రవ్వకాలలో లభించిన కుండలు, బొమ్మలు, పూసలు, ఇతర పరికరాలు నాటి జన జీవనాన్ని తెల్పుతవి. ముఖ్యంగా పెద్ద మొత్తంలో ఇక్కడ ప్రాచీన నాణాలు లభించినై. రాగి, సీసం, మిశ్రలోహాలవి కాక 78 బంగారువి, 1350 వెండి నాణాలు దొరుకుట విశేషం. ఇక్కడ రోమన్ నాణాలు కనిపించుట మరీ విశేషం. అవి అగస్టస్ / క్రీ.శ. ఆరంభ కాలానివి. అంటే అప్పటికే ఇక్కడ విదేశ వర్తక సంబంధాలు ఉన్నవన్నమాట.

ఈ నాణాల వ్రాతల పట్టి తేలిన విషయం - శాతవాహన తొలిరాజు శ్రీముఖుని (సిముఖ) రాజధాని ఇదే - కోటిలింగాల. ఈ జిల్లాలోని ధూళికట్టకోట, పెద్దబొంకూరు శాతవాహన పట్టణాలు అని 1972 తవ్వకాల్లో తేలింది. మెదక్ జిల్లా కొండాపురం శాతవాహన నగరమే. కోటిలింగాల తర్వాత మహారాష్ట్రలోని ప్రతిష్ఠానపురం - పైఠాన్ శాతవాహనుల ముఖ్యపట్టణం. క్రీ.పూ. 200 ఏండ్లు వీరి పరిపాలన సాగింది. క్రీ.పూ. ఒకటవ శతాబ్ది పులుమావి శాతకర్ణి మగధను కూడ జయించిండు. మౌర్య, శృంగ, కాణ్వ వంశాల పాలకుల తర్వాత శాతవాహనులు మగధ చక్రవర్తులు,

డా॥ మలయశ్రీ, రేకుర్తి, కరీంనగర్ - 505 451

గాథాసప్తశతి కూర్చిన హాలుడు క్రీ.శ. ఒకటో శతాబ్ది. (అందులో తెలుగు పదాలున్నవి అనేది పండితుల పరిశోధన ఫలితం. అయితే, క్రీ.పూ. ఒకటవ శతాబ్ది పులుమావి అనే పేరు అచ్చమైన తెలుగు పదం అనేది చారిత్రక సత్యం. పులు అంటే గడ్డి మావి అంటే గర్భం (వోంబ్) - శివపుత్రుడు కుమారస్వామికి 'శరజన్ముడు' అని పేరు. అచ్చంగా దాని తెలుగు పదం 'పులుమావి'. ఇది తెలుగు భాషా ప్రాచీనతను నిరూపించుటకు ఒక సజీవ ఆధారం అనవచ్చు).

2వ, శతాబ్ది గౌతమీపుత్ర శాతకర్ణి తల్లి వేయించిన శాసనం నాసిక్‌లో ఉంది. అతని సోదరుడు యజ్ఞశ్రీ శాతకర్ణి రాజధాని అమరావతి / ధాన్యకటకం. ఇతడే రెండవ నాగార్జునాచార్యుని గౌరవించిన ప్రభువు. ఇక శాతవాహన సామ్రాజ్యం (క్రీ.శ. 1,2 శతాబ్దులు) దక్షిణానికి వ్యాపించింది. అంటే - శాతవాహన రాజ్యం కోటిలింగాలలో పుట్టి, ఉత్తర భారతానికి విస్తరించి కుషాను/క్షత్రపుల ప్రతిఘటనవల్ల వెనుతిరిగి కోస్తా - అమరావతిలో స్థిరపడి వ్యాపించిదన్నమాట.

శాతవాహనులను ఆంధ్రులనే మన చరిత్రకారులు అంటున్నారు. మన పురాణాలు అట్లనే రాసినై. కాని, శాతవాహనులు / శాతకర్ణులు ఆంధ్రభృత్యులు. ఆంధ్రరాజుల కాలపు ఉద్యోగులు. ఆంధ్రప్రభువుల తర్వాతనే వీరి పాలన ప్రాభవం.

కోటిలింగాల శాతవాహనులకు ముందే ఆంధ్రరాజులకు రాజధాని. ఈ కోట వారు కట్టినదే. నాణాల పట్టి ఇక్కడి నుంచి పాలించిన ఆంధ్రరాజులు నలుగురు - గోబధ, నారన, కంవాయసిరి, సామగోప. మౌర్యరాజ్యాన్ని స్థాపించిన చంద్రగుప్తుని (క్రీ.పూ. 320) ఆస్థాన గ్రీకు రాయబారి మెగస్తనీస్ తన 'ఇండికా' గ్రంథంలో దక్షిణ భారత దేశంలో ఆంధ్రరాజులకు బలమైన 30 కోటలు ఉన్నట్లు రాసిండు. వాటిలో ప్రధానమైన కోట ఈ కోటిలింగాల అని చెప్పవచ్చు.

కోటిలింగాల గ్రామం కోటలో తూర్పుభాగాన ఉంది. పశ్చిమంగా ఇటుక కట్టుబావులు, ఒక బౌద్ధ స్థూప చైత్యం కనిపించినవి. దాని మీద బ్రహ్మీలిపి శాసనముంది. ఇది మౌర్యులకు పూర్వపుది. ఆంధ్రరాజుల కాలపుది అనవచ్చు. ఎందుకంటే భాష పాతది పైగా మొదటి శాలివాహన రాజు సిముకుడు జైనుడు. కోటిలింగాల సమీపంలోని కప్పరావుపేట దగ్గరి మునుల గుట్ట మీది గుహలో కొండ రాతిని తొలచిన అయిదు రాతి పడక గద్దెలున్నవి. ఇవి జైనసాధుల సల్లేఖన వ్రతానికి ఉపయోగపడేవి - ప్రాయోపవేశం. ఆ ప్రక్కన పారే పెద్ద వాగు పేరు మునేరు/మునుల ఏరు.

కోటిలింగాల క్రీ.పూ. 4వ శతాబ్దినాటి మహేంద్రనగరం. అనంతర కాలాన కోటలో కనిపించిన లింగాల కారణంగా ఇది కోటిలింగాల అయి ఉంటది. అదే తర్వాత కోటిలింగాలగా మారింది అనవచ్చు.

కోటిలింగాల గ్రామంలో ఇప్పటికీ క్రీ.పూ. నాటి చారిత్రక కట్టడాలు, వస్తువుల అవశేషాలు సాక్ష్యంగా మిగిలి ఉండుట మన భాగ్యం. అందుకు ప్రధాన కారణం - శాతవాహనుల తర్వాతి మరే రాజులు కానీ (ఇక్ష్వాకులు, విష్ణుకుండినులు, రాష్ట్రకూటులు, చాళుక్యులు, కాకతీయులు...) ఈ కోటను తమ పాలనా కేంద్రంగా చేసుకోలేదు. అదే మేలయి ఇవి మిగిలినై.

కోటిలింగాల మన రాష్ట్ర-దేశ అతిపురాతన చారిత్రక వారసత్వ సంపద. ఇది మన జాతీయ సంపద. దీన్ని మనం కాపాడుకోవలె. అయితే ఇప్పుడు కోటిలింగాల అదృశ్యమయ్యే ప్రమాదం వచ్చింది. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ఎల్లంపల్లి/శ్రీపాదసాగర్ ప్రాజెక్టు జలాశయంలో అది మునిగిపోనుంది. ఆ ఊరి రైతుల పంట భూములకు నష్టపరిహారంగా డబ్బుసైతం ఇచ్చిందట మన ప్రభుత్వం.

ఈ చారిత్రక స్థలం కనబడకుండా పోతుందనే చింత ఎవరికీ ఉన్నట్లు లేదు. ప్రభుత్వమా పట్టించుకోదు. అక్కడి ప్రజలు అమాయకులు, నాయకుల జాడ లేదు, ఈ మధ్య జిల్లా/రాజధాని రచయితలు కోటిలింగాల పరిరక్షణ కోసం శ్రమించుతున్నరు.

ప్రాచ్యలిఖిత గ్రంథాలయ సంచాలకులు డా॥ జయధీర్ తిరుమలరావు వెంట 26 నవంబర్ 07న ఆసక్తి గల జిల్లా రచయితలం కోటిలింగాలకు వెళ్ళి పరిశీలించి వచ్చినం. 7/12న డా॥ జయధీర్‌తో నాణాల పరిశోధకులు డా॥ డి. రాజారెడ్డి వచ్చింద్రు. భారతదేశంలో లభించిన నాణాల్లో కోటిలింగాలవే అత్యంత ప్రాచీనపువి అని వారి కథనం.

ప్రస్తుతం జిల్లాలో డా॥ మలయశ్రీ (నేను), డా॥ జైశెట్టి రమణయ్య, డా॥ జె. కిషన్, డా॥ సంగనభట్ల నరసయ్య, సంకెపల్లి నాగేంద్రశర్మ, సి. శ్రీనివాసరాజు మొదలగు అయిదారుగురికి మించి ఈ చారిత్రక విషయాలపై అంతగా ఆసక్తి లేదు. సాహిత్య గౌతమి, తెరవే, సైతం ఇప్పుడు శ్రద్ధ చూపుతున్నవి.

కోటిలింగాల ముంపుకు గురికాకుండా ప్రయత్నించుట, కోటలో తవ్వకాలు జరిపించుట, ముంపుకు గురి అయితే నాగార్జున కొండ - విజయపురిలోవలె ఇక్కడ పురాతన కట్టడాల పరిరక్షించుట మన తక్షణ కర్తవ్యం. విజయపురి కంటే (శాతవాహనులు, ఇక్ష్వాకులు) కోటిలింగాల (ఆంధ్రులు, శాతవాహనులు) పట్టణం / కోట చాల పూర్వపుది, చారిత్రక ప్రాధాన్యత కలది అనేది నిజం.

కొసమెరుపు - తుది విన్నపం : తేది 22 జూన్ 2008 జగిత్యాల పట్టణంలో డా॥ జైశెట్టి రమణయ్య 'కరీంనగర్ జిల్లా చరిత్ర - సంస్కృతి' అను ఆంగ్ల బృహత్ గ్రంథ ఆవిష్కరణ జరిగింది. ఆ మహాసభకు జిల్లా రచయితలం చరిత్ర జిజ్ఞాసులం పలువురం వెళ్ళినం. డా॥ వి.వి. కృష్ణశాస్త్రి, చుక్కా రామయ్య, కె. జితేంద్రబాబు, ఆం. ప్ర. పురావస్తు శాఖ డైరక్టర్ ప్రొ. రెడ్డి మొ॥ వారు వక్తలు. కరీంనగర్ జిల్లా మంత్రులు జె. రత్నాకరరావు, టి. జీవన్‌రెడ్డి, మాజీమంత్రి ఎల్. రమణలు ముఖ్య అతిథులు.

ఆ సమయంలో కోటిలింగాల ప్రసక్తి (ముంపకం - పరిరక్షణ చర్చ) వచ్చింది. అప్పుడు దేవాదాయశాఖ మంత్రి రావు ఈ విషయంపై స్పందించిను. "ఈ విషయం మా దృష్టికి వచ్చింది. దాన్ని కాపాడుతం. కోటిలింగాలలో ఎక్కడ తవ్వినా బొమ్మలు వెలువడుతున్నట్లు తెలిసింది. అది ఎత్తు ప్రదేశంలోనే ఉంది. ప్రాజెక్టు నీరు ఆ ప్రదేశం ఊరు వరకు రాకుండా చూస్తం. అయినా ముందుగానే తవ్వకాలు జరిపించి, ఆ ప్రదేశ కట్టడాలను, వస్తువులను వేరే చోటికి (నాగార్జున

కొండ విజయపురి వలె) చేర్చి భద్రపరుస్తం - అని అన్నారు. దీన్నిబట్టి చూస్తే మంత్రిగారికి ఆ స్థల విశేషత - ప్రాధాన్యతపై సరియైన అవగాహన కలుగలేదని మా రచయితలకు అనిపించింది.

ఇప్పుడు గౌరవనీయ మంత్రిగారికి సవినయంగా నా విన్నపం ఏమంటే- అయ్యా! కోటిలింగాల ఇప్పుడు కుగ్రామం. ఒకప్పుడు పూర్వకాలాన క్రీ.పూ. 455 శతాబ్దాల్లో అది మహేంద్రనగరం. తొలి శాతవాహన రాజులకు ఇది రాజధాని. అంతకు ముందు నలుగురు ఆంధ్రరాజుల పాలన ఇక్కడి నుంచి సాగింది. ఆంధ్ర రాజుల, శాతవాహనుల నాణాలు ఇక్కడ దొరికినై. ఆంధ్రుల కాలం క్రీ.పూ. 4వ, శతాబ్ది బౌద్ధ స్థూపం శిథిలమై పొలాల్లో కల్సిపోయింది.

కోటిలింగాల పట్టణం చుట్టు పెద్ద ఇటుక కోట ఉండేది. దక్షిణం దిక్కు మునేరు ప్రక్క కోట గోడ ఉంది. పశ్చిమం కోట బురుజు దిబ్బ ఉంది. ఉత్తరం గోదావరి తీరపు గోడ కూలింది. లేదు తూర్పు - ఆగ్నేయం బురుజు మీదనే ఇప్పుడు జనం పూజలందుకుంటున్న కోటేశ్వర స్వామి గుడి ఉంది. ఎత్తు స్థలంలో ఉంది అని మీరన్నది ఈ గుడినే కావచ్చు. ఆ గుడికోసం కాదు మా బాధ. ఇటువంటి దేవుళ్ళు - ఆలయాలు ఎన్నో వస్తుంటవి, పోతుంటాయి. కోట శిథిలమైన తర్వాత ఆ ఆలయనిర్మాణం జరిగిందనేది స్పష్టం. పురాణాల కథలు అటుండనీయండి.

ఇక ఆ ఊరి భూమి తవ్వితే దొరికేది విగ్రహాలు కాదు - ఇటుకలు, కుండల పెంకులు, ఇతర పరికరాలు - వస్తువులు లభిస్తున్నవి. ఆ కోట గోడల ఇటుకలతోనే ఊరిలోని సగం ఇండ్ల గోడలు, పెరండ్ల చుట్టు అడ్డుగోడలు కట్టుకున్నరు. అవి ఇప్పటికీ మనం చూడవచ్చు. భూగర్భాన ఇంకెన్ని చారిత్రక విశేషాలున్నవో. 1980 తవ్వకాల్లో అక్కడ అశ్వమేధ యాగ కుండం కనిపించినట్లు వినికిడి. అధికారులు దాన్ని బలపరచినా ఎందుకో ఆ విషయాన్ని వెలువరించలేదు. ఇది విజయపురి ఇక్ష్వాకుల అశ్వమేధ కుండంకంటే 5, 6 వందలేండ్లు పూర్వపుది - ఆంధ్రరాజులదో, శాతవాహనులదో.

ఇక్కడి రోడ్డు దగ్గరి 'పాశిగాం' స్తూపం ఇటీవలే శిథిలమైంది. అది క్రీస్తుపూర్వం కాలపుది. ఇది కాళిదాసు కాలపు బౌద్ధ కవి జిజ్ఞాగుని నివాస స్థలమని వి.వి. కృష్ణశాస్త్రి అభిప్రాయం. బుద్ధుని కాలపు పాయసి గ్రాం-పాశిగాం అయ్యిందేమో అని నా అనుమానం.

కప్పారావుపేట గిరి గుహలు జైనులవి. బుద్ధుని సందర్శించిన బావరి (బాదనకుర్తి) శిష్యులు 16 మందిలో ఒకతని పేరు కప్పడు, కప్పరావుపేట అతని పేరిటిదేమో.

ఆంధ్రశాతవాహన రాజుల నాణాలతో పాటు, ఇక్కడ రోమన్ బంగారు నాణాలు దొరికినవి. అది ఈ ప్రాంతానికి నాడు సుదూర దేశాలతో ఉన్న వర్తక సంబంధాల తెలుపుతుంది. కోటిలింగాల ఆంధ్రుల నాణాలే భారత దేశంలో మొదటివట. ఇక్కడి నాణాల రాతలు / పేర్లు తెలుగు భాషలో మొట్టమొదటివని పరిశోధకుల కథనం.

ఇక్కడి పెరళ్ళలో నాటి ఇటుక కట్టు బావులున్నవి. ఇళ్ళ వాకిళ్ళ కడమల ముందు తొక్కుడు రాళ్ళ మీద శాసనాల అక్షరాలున్నవి. ఇంకా చాల పరిశోధన జరుగవల్సి ఉంది. పుణ్యక్షేత్రమనే కాక, కోటిలింగాల మన రాష్ట్రానికి, మొత్తం భారత దేశానికి తలమానికం అనదగిన ప్రముఖ పురాతన చారిత్రక స్థలం అని గ్రహించి దీన్ని కాపాడవల్సిందిగా ప్రభుత్వానికి, ప్రజలకు మనవి.




సరస్వతి సమ్మాన్‌కు ఇచ్చే జ్ఞాపిక

MISIMI / మిసిమి / RNI Regd.No.45042/90 Telugu Monthly, Hyderabad - 500 020
Postal Regd.No.H/SD/191/2009-11



పూజలందుకొంటున్న సరస్వతి